ప్రజాశక్తి

సోమవారం 27 ఫిబ్రవరి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

'వెలిగొండ'ను పూర్తి చేసి

రైతుల రుణం తీర్చుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

రాబోయే బడ్జెట్ సమావేశంలో వెలుగొండ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించి.. ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి.. వైసిపి ప్రభుత్వం రైతు రుణం తీర్చుకోవాలని సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. సిఎస్‌పురం, పామూరు మండలాల సిపిఎం కార్యకర్తల సమావేశం పప్పు యంకోబరావు మీటింగ్ హాలులో షేక్ అల్లాబక్షు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ సమావేశంలో వెలుగొండ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తయితే పశ్చిమ ప్రాంతం ప్రజల వలసలు నివారించవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నదని ఆరోపించారు. వేసవిలో ప్రజలకు తాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో పామూరు, సిఎస్‌పురం మండలాల నాయకులు ఊసా వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి, శంకర్, షేక్ ఖాశిం, సిహెచ్ వెంకటేశ్వర్లు, షేక్ గౌస్‌బాషా, తిరుపతిరెడ్డి, ప్రసాద్, భానుమతి, ఖాదరున్నీసా, వీరనారాయణ, జయరావు, ఎం.పీరా, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై వ్యూహాలు

- ప్రలోభాలపైనే దృష్టి
- సారించిన పాలకపక్షం
- పార్టీ పరమైన ఎజెండాతో
- ప్రతిపక్ష అభ్యర్థులు
- అన్ని వర్గాల సమస్యల
- ఎజెండాతో పిడిఎఫ్ అభ్యర్థులు



యర్రగొండపాలెంలో పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పుడు రాజకీయ పార్టీలు ఎన్నడూ లేని విధంగా వ్యూహాల్లో ఉన్నాయి. అన్ని రకాలుగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సన్నాహాల్లో ఉన్నారు. అధికారం హంగుతో గెలుపు కోసం పాలకపక్షం బాగా దృష్టి సారించింది. ఉద్యోగ వర్గాలు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నందున ప్రత్యామ్నాయాలపైనా దృష్టి సారించారు. అన్ని రకాల అడ్డదారులూ తొక్కేందుకు సిద్ధమవు తున్నారు. ప్రజాసమస్యలే ఎజండా ముందుకు సాగు తున్న పిడిఎఫ్ అభ్యర్థులు మూడు పర్యాయాలుగా గెలు స్తూనే ఉన్నారు. శాసనమండలిలో ఉద్యోగ, కార్మికుల సమస్యలపై పిడిఎఫ్ పెద్దఎత్తున గళం విప్పుతోంది. పిఆర్‌సి ఉద్యమంలోనూ కీలకపాత్ర పోషించారు. దీంతో ఈ సారి పిడిఎఫ్‌పై అన్ని రకాలుగా కుట్రలు పెట్టుకొని పాలక, ప్రతిపక్షపార్టీలు పోటీకి అభ్యర్థులను దింపారు.

పిడిఎఫ్ అభ్యర్థులు గెలిస్తే భవిష్యత్‌లో పోరాటాలకు కీలకపాత్ర పోషిస్తారనే భయంతోనే రెండు పార్టీలూ అభ్యర్థులను దింపాయి. గతంలో పాలకపక్షంగా తెలుగుదేశం నుంచి పోటీ చేయగా ఓటమిపాలయ్యారు. వైసిపి నుంచి అభ్యర్థులు బరిలో లేరు. పిడిఎఫ్ కూటమికి ఆదరణ ఉన్నందున పోటీ చేయలేదు. పిడిఎఫ్‌కే సంఘీభావం ప్రకటించారు. ఈ సారి రెండు పార్టీల నుంచీ అభ్యర్థులు బరిలో ఉన్నారు. దీంతో త్రిముఖ పోటీ నెలకొంది. పిడిఎఫ్, వైసిపి, తెలుగుదేశం అభ్యర్థుల మధ్య పోటీ బలంగా ఉంది. గెలుపు కోసం వ్యూహాలు నడుస్తున్నాయి. పాలకపక్షం నుంచి నిలబడిన అభ్యర్థుల విజయం కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు అహర్నిశలూ పనిచేస్తున్నారు. ఓటర్లపై అన్ని రకాలుగా దృష్టి సారించారు. ఉపాధ్యాయులపైనా ఒత్తిడి తెస్తున్నారు. ప్రైవేటు టీచర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఓటర్లకు డబ్బులు ఇస్తామనే ప్రచారాలు ముందుకు తెచ్చారు. వారిలోనూ భ్రమలు కల్పిస్తున్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లకు పెద్దఎత్తున డబ్బులు వస్తాయనే పుకార్లు కల్పిస్తున్నారు. ముందుగానే ఓటర్లను దృష్టి మళ్లిస్తున్నారు. పార్టీ క్యాడర్‌ను క్షేత్రస్థాయిలో పెట్టారు. ఓటర్లను ఏదో రకంగా మభ్యపెట్టాలని చెబుతున్నారు. ఎమ్మెల్యేలపైనా ఒత్తిళ్లు పెంచారు. ఓటర్ల జాబితాలు పట్టుకుని పాలకపక్ష సైన్యం అన్ని రకాలుగా ఒత్తిళ్లు చేస్తున్నారు. తెలుగుదేశం నుంచి పోటీచేసిన అభ్యర్థుల కోసం ఆ పార్టీ నేతలు ఓ స్థాయిలో పనిచేస్తున్నారు. పార్టీపరంగానే వీటిని చూస్తున్నారు. ఎజెండా ఏమీ లేదు. ఎందుకంటే తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగవర్గాలకు చేసిందేమీ లేదు. ఇప్పుడు పిడిఎఫ్ తెరపైకి తెచ్చిన డిమాండ్లు చంద్రబాబు హయాంలోనూ ఉన్నాయి. అప్పుడు పోరాటాలు చేశారు. ఇప్పుడూ చేస్తున్నారు. రెండు పార్టీల ధోరణి ఒక్కటే.. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవు. నియామకాలు లేవు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో రెండు ప్రభుత్వాలూ ▶ 2లో

నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు

- 50 రోజులు గడిచినా
- ఎదుగుదల లేని మొక్కజొన్న పైరు
- పసుపు రంగులోకి మారిన వైనం
- పెట్టుబడి కూడా దక్కదని
- రైతు ఆవేదన
- కంపెనీ ఉద్యోగులు వచ్చి
- చూసినా ఫలితం శూన్యం



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-పంగులూరు

ఎన్నో ఆశలతో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి సాగు చేసిన మొక్కజొన్న పైరు ఒక్కసారిగా రైతులకు నిరాశను మిగిల్చింది. మిగతా రైతుల మొక్కజొన్న పొలాలను చూసి.. తన పొలంలో అభివృద్ధి లేకపోవడం చూసి రైతులు కుంగిపోతున్నారు. ఇదేమని విత్తనాలు ఇచ్చిన షాపు యజమానిని అడిగితే కంపెనీ వారిని పంపిస్తామని చెప్పాడు. కంపెనీ ఉద్యోగులు వచ్చి ఏమీ తేల్చకుండా వెళ్లిపోయారు. ఈ పరిస్థితుల్లో తాను ఏం చేయాలో అర్థంకాక పలువురు రైతులు విలవిలలాడుతున్నారు.



రైతు నాటిన విత్తనాలకు సంబంధించిన కవర్

మండలంలోని కొండమంజులూరు గ్రామానికి చెందిన బత్తుల ఆంజనేయులు అనే రైతు ఈ సంవత్సరం ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. గత సంవత్సరం మొక్కజొన్న పైరు మంచి ఫలితాన్ని ఇవ్వటంతో, ఈ సంవత్సరం కూడా అదే ఫలితాన్ని ఆశించి, ఎకరా రూ.12 వేల చొప్పున కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశాడు. భారతి 56 రకం విత్తనాలను నాటాడు. భారతి 56 రకం మొక్కజొన్న విత్తనాలను నాలుగు కిలోల ప్యాకెట్టు రూ.900 చొప్పున, ఎకరాకు మూడు ప్యాకెట్లు (12 కిలోలు) లెక్కన ముప్పవరంలోని బాలాజీ విత్తనాల షాపులో విత్తనాలు తీసుకొని గత జనవరి 10వ తేదీన విత్తనాలను నాటాడు. ఇప్పటికీ ఎకరాకి 35 వేల రూపాయలు కౌలుతో కలుపుకొని పెట్టుబడి పెట్టాడు. విత్తనాలు నాటి ఇప్పటికి 47 రోజులు అవుతున్నా పైరులో ఎదుగుదల లేదు. పైగా పైరు పసుపు రంగులోకి మారింది. ఆకులు కూడా ముడత వచ్చాయి. ఇదే గ్రామంలో చుట్టుపక్కల పొలాల్లో వేసిన వేరే రకం విత్తనాల పైర్లు బాగా ఏపుగా పెరిగి, చూసేందుకు ఆశాజనకంగా ఉన్నాయి. ఇదే పొలం పక్కన గ్రామానికి చెందిన కొలకలూరి ఏసోబు కూడా భారతి 56 రకం విత్తనాలను మూడు ఎకరాల్లో నాటాడు. ▶ 2లో

పాలన మారినా

ఆగని అవినీతి బాగోతం

- ఒకసారి రూ.15 లక్షలు
- మరోసారి రూ.16 లక్షలు
- ఇప్పుడు రూ.14 లక్షలు
- నిధుల వాడకంలో
- అధికారుల ఇష్టారాజ్యం
- శింగరాయకొండ
- పంచాయతీలో తీరిదీ.!



ప్రజాశక్తి-శింగరాయకొండ

అప్పుడు ప్రత్యేక అధికారులు పాలన.. ఇప్పుడు సర్పంచుల పాలన.. పాలన ఏదైనా గానీ శింగరాయకొండ పంచాయతీలో అవినీతి బాగోతం మాత్రం మారడం లేదు. ఇక్కడ పంచాయతీలో అధికారులు డబ్బులను డ్రా చేసి.. సొంత అకౌంట్లో జమ చేసుకుంటారు. కానీ కార్యాలయం రికార్డుల్లో మాత్రం లెక్కలు ఉండవు. ఇలా మొదటి నుంచి జరుగుతూనే ఉంది. ఉన్నతాధికారుల చర్యలు నామమాత్రంగా ఉండటం వల్లే అవినీతి కొనసాగుతోందనే విమర్శలున్నాయి.

పంచాయతీ ఎన్నికలు జరగకముందు శింగరాయకొండలో ప్రత్యేక అధికారుల పాలన సాగింది. సర్పంచుల పాలన వచ్చినప్పటికీ.. అప్పటి నుంచి ఇప్పటివరకు శింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులు ఉండవు. ఆ రికార్డులను సరిచేయాలన్న ఆలోచన అధికారులకు ఉండదు. జిల్లా అధికారులు సైతం తనిఖీలకు వచ్చి పోయినా ఇక్కడ రికార్డులు గురించి అడగని పరిస్థితి ఉంది. 2019 నుంచి డబ్బులు వస్తున్న లెక్కలు చూపకుండా ఖర్చు చేసి గోల్‌మాల్ చేస్తున్నారు. ఇప్పటికి రెండు సార్లు ఒకసారి రూ.15 లక్షల గోల్‌మాల్ జరిగినప్పుడు.. 'ప్రజాశక్తి'లో 'కంచే చేను మేస్తే..' అనే వార్త రావటంతో అధికారులు కదిలి సరిచేశారు. మరోసారి రూ.16 లక్షల గోల్‌మాల్ జరిగినప్పుడు 'ఆ కంచె చేను మేస్తానే..' అనే కథనంతో అధికారులు కదిలి హెచ్చరించి.. సస్పెన్షన్లు చేసి వెళ్లారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఇక్కడ కార్యదర్శులు మారుతున్నప్పటికీ కార్యాలయం తీరు మారని పరిస్థితి. ▶ 2లో

నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు

(మొదటిపేజీ తరువాయి)

అది కూడా ఎదుగూబొదుగూ లేకుండా ఉంది. పక్కన ఉన్న పొలాల్లో ఇంకో కంపెనీకి చెందిన విత్తనాలను నాటిన పొలాలు బాగున్నాయి. మరికొన్ని పొలాల్లో మరో కంపెనీ విత్తనాలు నాటిన పొలాలు కూడా బాగానే ఉన్నాయి. అయితే ఈ విషయమై రైతు విత్తనాల షాప్ యజమాని శ్రీనివాసరాజుకు విషయం తెలియజేయగా ఆయన కంపెనీకి తెలియజేసి ఉద్యోగులను పరిశీలనకు పంపారు. వచ్చిన ఉద్యోగులు విత్తనంలోఎలాంటి తేడా లేదని, కేవలం భూమి మాత్రమే అందుకు అనుకూలంగా లేదని చెప్పి వెళ్లిపోయారని రైతు ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఇదే భూమిలో ఇదే కంపెనీ విత్తనం వేయగా ఎకరాకు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని ఆంజనేయులు తెలిపారు. కంపెనీ నాసిరకం విత్తనాలు ఇవ్వడం వల్లే, తన పొలంలో పైరు బాగా లేదని, ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి తనకు న్యాయం చేయాలని రైతు ఆంజనేయులు కోరుతున్నారు.

నకిలీ విత్తనం వల్లనే పైరు ఎదగలేదు

రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామారావు

భారతి 56 రకం విత్తనం నకిలీది కావడం వల్లనే ఆంజనేయులు పొలంలో పైరు దెబ్బతిందని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు అన్నారు. ఆదివారం రామారావు ఆంజనేయులుకు చెందిన మొక్కజొన్న పైరును పరిశీలించారు. గత మూడేళ్లుగా మొక్కజొన్న విత్తన కంపెనీలు నకిలీ విత్తనాలను సరఫరా చేస్తూ రైతులను మోసం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కోటపాడు గ్రామంలో బెండ విత్తనాలు కూడా నకిలీవి వచ్చాయన్నారు. మిర్చిలో కూడా నకిలీ విత్తనాలు కూడా వస్తున్నాయన్నారు. విత్తన కంపెనీలపై ప్రభుత్వం నియంత్రణ తగ్గిందనటానికి ఇది ఒక నిదర్శనమని పేర్కొన్నారు.

విత్తనాల్లో తేడా ఉండటం వల్లే..

మొక్కజొన్న రైతు బత్తుల ఆంజనేయులు

నేను గత నాలుగేళ్లుగా మొక్కజొన్న సాగు చేస్తున్నా.. గతంలో ఎన్నడూ ఈ విధంగా జరగలేదు. గత సంవత్సరం కూడా భారతీయ 56 రకం విత్తనాలు సాగు చేశా.. మంచి ఫలితం వచ్చింది. కానీ ఈ సంవత్సరం నాసిరకం విత్తనాలు రావడం వల్లనే పైరు పూర్తిగా దెబ్బతినిపోయింది. అధికారులు న్యాయం చేయాలి,

ఆగని అవినీతి బాగోతం

(మొదటిపేజీ తరువాయి)

ఎవరికి దోచినట్టు వారు దోచుకొని పోతుండటంతో పంచాయతీ పరిస్థితి దారుణంగా ఉంది. పూర్తిస్థాయిలో గ్రామ పంచాయతీ సర్పంచ్ తాటిపర్తి వనజ పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇక్కడ పనిచేస్తున్న అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో రికార్డులు ఒక్కటే లేవని జిల్లా ఆడిట్ అధికారులు అక్షింతలు వేసిన ఘటన కూడా గత నెలలో జరిగింది. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు డబ్బులు వాడుకోవడంతో ఇక్కడ సమస్యలు మొదలవుతున్నాయి. తాజాగా రూ.13,91,071 గోల్‌మాల్ జరిగిందని ఒంగోలు డిఎల్‌పిఒ పద్మజ, ఈఓఆర్‌డి అంజలీదేవి ఆధ్వర్యంలో జరిగిన విచారణలో బయటపడింది. సుమారు రూ.14 లక్షలకి సంబంధించి డబ్బులు డ్రా చేశారని, దీనికి సంబంధించిన రికార్డులు లేవని, ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు డ్రా చేశారని డిఎల్‌పిఒ చెప్పారు. ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డికి పూర్తిస్థాయి నివేదికను అందజేస్తానని వివరించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో నిధులు గోల్‌మాల్ జరుగుతుంటే అధికార యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తూనే ఉంది. బాలాజీనగర్ వాసుల ఫిర్యాదుతో శుక్రవారం నాడు ఉదయం నుంచి రాత్రి వరకు డిఎల్‌పిఒ పద్మజ విచారణ చేస్తూనే ఉంది. ఆ విచారణలో సుమారు రూ.14 లక్షల నిధులు గోల్‌మాల్‌పై ఎలాంటి చర్యలు ఉంటాయనేది వేచి చూడాలి. జిల్లాస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేపడితే ఇంకా అక్రమాలు బయటపడే అవకాశాలున్నాయి.

పునుగోడును 'వెలిగొండ' పరిధిలో చేర్చాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కనిగిరి : మండల పరిధిలోని పునుగోడు మాకేరు వాగుపై ఉన్న పునుగోడు రిజర్వాయర్‌ను వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి చేర్చాలని కోరుతూ వెలిగొండ జలాల సాధన సమితి నాయకుల ,ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాకేరు జన్మస్థలమైన బడుగులేరు నుంచి 4 కిలోమీటర్ల దూరం నుంచి వెలుతున్న వెలిగొండ తూర్పు ప్రధాన కాలువ నుంచి కృష్ణా జలాలను మాకేరులోకి తరలించవచ్చని తెలిపారు. భూసేకరణకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ భూమి ఉందని కేవలం కాలువలు నిర్మిస్తే సరిపోతుందని తెలిపారు. దీంతో మాకేరు పరిధిలోని పలు గ్రామాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. కనిగిరికి దిగువన ఉన్న కందుకూరు నియోజకవర్గ పరిధిలోని రాళ్లపాడు ప్రాజెక్ట్‌ను వెలిగొండ పరిధిలోని చేర్చి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పునుగోడు రిజర్వాయర్‌ను వెలుగొండ పరిధిలో చేర్చేందుకు కృషి చేయాలని అందుకు తామంతా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలిగొండ జలాల సాధన సమితి ప్రధాన కార్యదర్శి, గుడిపాడు సర్పంచి దామిరెడ్డి నాగేంద్రరెడ్డి, వైఎస్ ఎంపిపి లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, జడ్‌పిటిసి `స్తూరిరెడ్డి, షేక్ రహీం, నరసింహారావు పాల్గొన్నారు.

'అప్పర్‌భద్ర'ను నిలిపివేయాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథి గృహంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రంలో కృష్ణానదిపై అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మించడం వల్ల దిగువకు కృష్ణా బేసింగ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాజెక్టులైన శ్రీశైలం, పులిచింతల ప్రాజెక్టు నందు నీరు సమృధిగా లభించదని తెలిపారు. ప్రాజెక్టుల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడం సాధ్యపడదని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు రాక పశ్చిమ ప్రాంతమంతా ఏడారిగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : గఫార్

ప్రజాశక్తి-కనిగిరి

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. స్థానిక గార్లపేటరోడ్డులోని వృద్ధాశ్రమంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వృద్ధులకు గౌరవ ప్రధామైన జీవితాన్ని గడిపే హక్కు ఉందన్నారు. అందుకు తగిన చట్టాలు కూడా ఉన్నాయని తెలిపారు. చట్టాలను అతిక్రమించి వృద్ధులను ఇబ్బందిపెడితే చట్ట పరంగా శిక్షార్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్ ,గుడ్‌హెల్ఫ్ డైరెక్టర్ మంద్రు రమేష్‌బాబు,వృద్ధాశ్రమ నిర్వహకులు ఎ. రంగనాయకులు ,న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై వ్యూహాలు

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కటే. రాష్ట్ర విభజన జరిగాక జిల్లాలో ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఉన్నవే మూతపడుతున్నాయి. అనేక రంగాలు సంక్షోభంలో పడుతున్నాయి. పాలకపక్షాలుగా ఉన్న తెలుగుదేశం, వైసిపిలదే బాధ్యత కదా? అనేది ఆలోచించాలి. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలుచేశారో ఆ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు చెప్పలేని పరిస్థితి. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్నారు. అమలు చేశారా? పిఆర్‌సి, సిపిఎస్ రద్దుపై చెప్పిన వాటిల్లో ఏ మేరకు అమలుచేశారో చూస్తున్నాం. వీటిపై పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు ఏమీ చెప్పలేని పరిస్థితి ఉంది. అందుకే ప్రలోభాలు, రాజకీయాలను ఎజెండాగా ఎంచుకున్నారు. పిడిఎఫ్ నుంచి పోటీచేస్తున్న అభ్యర్థులు పూర్తిగా ప్రజల ఎజెండానే.. పోరాటాలతోనే వాటిని సాధించడం వారి ఎజెండా.. ఉద్యోగ, కార్మిక, కర్షక, విద్యార్థి, యువజనులు, మహిళలు, ప్రజాసంఘాలు వీరికి అండగా ఉంటున్నాయి. ఓటర్లను కలుసుకొని ఆయావర్గాల సమస్యలపై తమ వైఖరి చెబుతున్నారు. గెలిచాక ఏం చేస్తామనేదీ స్పష్టంగానే ప్రకటిస్తున్నారు. ఈ ఐక్యతను కూడా చెడగొట్టేందుకు పార్టీలు సన్నాహాల్లో ఉన్నాయి. ఉపాధ్యాయుల్లోనూ పార్టీల పరంగా చీలిక తెచ్చేందుకు పాలకపక్షం కుట్రలు చేస్తోంది. వీటిపై ఉపాధ్యాయులు మాత్రం గుర్రుగానే ఉన్నారు. ఏదేమైనా మండలి పునరుద్దరణ జరిగాక రాజకీయంగా బలంగా దృష్టిపెట్టిన ఎన్నికలుగా మారాయి. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్‌ల కోసం కాకుండా పార్టీల ప్రతిష్ట కోసం అన్నట్లుగానే కనిపిస్తున్నాయి. ఓటర్ల పాత్రే ఇప్పుడు కీలకంగా మారింది.

నూతన కమిటీ ఎన్నిక

యర్రగొండపాలెం : ఎంపిజె నూతన పట్టణ శాఖను ఆదివారం ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడిగా షేక్ షేక్షావలి, ప్రధాన కార్యదర్శిగా తోట రామకష్ణ, కోశాధికారిగా షేక్ మోహియుద్దీన్‌ను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ పీడిత ప్రజల గొంతుకగా నిలబడి వారికి చెందాల్సిన హక్కులను ఇప్పించేందుకు ముందు ఉండాలని తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎను న్నకున్నారు. అనంతరం ఎంపిజె ఆధ్వోర్యంలో నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షస్త్రక్ ఖాసిం, యంపిజె ఫౌండర్ మెంబర్ పఠాన్ ఖాశింఖాన్ పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ ప్రకాశం జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జివారి కోర్టులో, ఒంగోలు.

ఐ.ఏ. నెం.960/2022 ఐ.ఏ.నెం.85/2022

ఓ.యస్.నెం.14/2013

పులకందం బద్దిరెడ్డి .... పిటిషనరు

వర్సెస్

పఠాన్ బాబూఖాన్ వగైరాలు ... రెస్పాండెంట్స్

To

(R3) పఠాన్ ఆదంఖాన్, తండ్రి ఇమామ్ ఖాన్
(R5) పఠాన్ మస్తాన్ వలి, తండ్రి ఇమామ్ ఖాన్
(R8) పఠాన్ మస్తాన్‌బి భర్త బాబు ఖాన్
పై తెలిపిన 3, 5 మరియ 8 వారల నివాసము ఇంకొల్లు (గ్రా), ప్రకాశం జిల్లా.
(ప్రస్తుతం బాపట్లజిల్లా)

నోటీసు

పై నెంబరు పిటిషనులో 3,5 వ మరియు 8వ రెస్పాండెంట్స్ అయిన మీయొక్క నోటిసు పేపర్ ద్వారా జారీచేయు నిమిత్తం తేదీ:09-03-2023 కి వాయిదా అయిఉన్నది. కావున ఆరోజు ఉదయం గం.10-30 ని.లకు మీరు స్వయంగా కాని, అడ్వొకేటు ద్వారాకాని, పైకోర్టువారి ఎదుట హాజరు అయి మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల ఆరోజు మీపరోక్షమునందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయటమయినది.

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు. ఇట్లు,
తేది: 24-02-2023
పరుచూరి లక్ష్మీ కుమారి
పువ్వాడ సింగయ్య
M. రవీంద్రనాథ్ రెడ్డి
పిటిషనర్ తరపు న్యాయవాదులు ఒంగోలు

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ ప్రకాశం జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జివారి కోర్టు లో, ఒంగోలు.

ఐ.ఏ.నెం. 85/2022 ఓ.యస్.నెం. 14/2013

పులకందం బద్దిరెడ్డి .... పిటిషనరు

వర్సెస్

పఠాన్ బాబూఖాన్ వగైరాలు ...రెస్పాండెంట్స్

To

(R3) పఠాన్ ఆదంఖాన్, తండ్రి ఇమామ్ ఖాన్
(R5) పఠాన్ మస్తాన్ వలి, తండ్రి ఇమామ్ ఖాన్
పై తెలిపిన 3 మరియు 5 వారల నివాసము ఇంకొల్లు (గ్రా), ప్రకాశం జిల్లా.
(ప్రస్తుతం బాపట్లజిల్లా)

నోటీసు

పై నెంబరు పిటిషనులో 3వ మరియు 5వ రెస్పాండెంట్స్ అయిన మీయొక్క నోటిసు పేపర్ ద్వారా జారీచేయు నిమిత్తం తేదీ:09-03-2023 కి వాయిదా అయిఉన్నది. కావున ఆరోజు ఉదయం గం.10-30 ని.లకు మీరు స్వయంగా కాని, అడ్వొకేటు ద్వారాకాని, పైకోర్టువారి ఎదుట హాజరుఅయి మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల ఆరోజు మీ పరోక్షమునందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయటమయినది.

// కోర్టువారి అనుమతితో //

ఒంగోలు ఇట్లు
తేది 24-02-2023
పరుచూరి లక్ష్మీ కుమారి
పువ్వాడ సింగయ్య
M. రవీంద్రనాథ్ రెడ్డి
పిటిషనర్ తరపు న్యాయవాదులు ఒంగోలు

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ ఒంగోలు ఫ్యామిలీ కమ్ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఎ.ఎస్. నెం. 113/2019

తన్నీరు సుబ్బరత్తమ్మ .... వాది

వర్సెస్

కుంచాల లక్ష్మమ్మ మరియు ఇతరులు ...ప్రతివాదులు

To

ప్రతివాది/రెస్పాండెంట్

కుంచాల లక్ష్మమ్మ, భర్త వెంకటరమణ,
59 సం॥ల వయస్సు, మర్లపాడు గ్రామం,
టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు సివిల్ అప్పీలులో మీరు ప్రతివాది అయియున్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీకు చేరనందున శ్రీ కోర్టువారు మీకు నోటీసు నిమిత్తం ప్రజాశక్తి పేపరు ఒంగోలు ఎడిషన్లో పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచుటకు ఆర్డరు వేసినారు. మీరు ఈ ప్రకటనను చూసిన పిదప తేది: 06-03-2023 ఉదయం 10:30 గం॥ లకు మీరు గానీ, మీ తరఫున లాయరు గానీ కోర్టువారి ఎదుట హాజరై మీకు పై తెలిపిన అప్పీలులో అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపుకోవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల మీకు ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి పై తెలిపిన సివిల్ అప్పీలును కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది..

ఒంగోలు.
తేది 24-02-2023 ఇట్లు
పంగులూరి గోవిందయ్య
గనిపినేని శ్రీనివాసులు
వాది తరపున న్యాయవాదులు ఒంగోలు

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు

- ఒకరు మృతి
- మరొకరికి గాయాలు
- పరిశీలించిన పోలీసులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని పాత శింగరాయకొండ పెరల్ డిస్టలరీ వద్ద ఆదివారం నాడు కారు మోటార్ బైక్‌ను ఢీకొన్న ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు గ్రామానికి చెందిన తాతా మనవళ్లు జామకాయల వ్యాపారం చేస్తూ ఉంటారు. అదే రీతిలో టీవీఎస్ ఎక్సెల్ బైక్ మీద జామకాయలను తీసుకొని వెళుతున్న నైనాల సుబ్బారావు(60) ఆయన మనవడు ఈదుపల్లి సాయిని ఇన్నోవా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారావు అక్కడికక్కడే మృతిచెందగా మనుమడు సాయి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించారు. ఉదయాన్నే మద్దిపాడు వద్ద తోటలో జామకాయలు తీసుకొని తమ అల్లుళ్లకు ఇచ్చేందుకు సుబ్బారావు బయలుదేరాడు. పెరల్ డిస్టలరీలో పనిచేస్తున్న ఓ అల్లుడు వద్దకు వెళ్లేందుకు బైకు రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు నుంచి విజయవాడ వెళుతున్న కారు వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. పెరల్ డిస్టలరీ ఎదురుగా జరిగిన ఈ ప్రమాదంలో సుబ్బారావు రోడ్డుపై పడిపోగా అతను టీవీఎస్ ఎక్సెల్ బైకు కారు ఢీకొట్టడంతో దూరంగా పడిపోయింది. బండి మీద ఉన్న జామకాయలు రోడ్డంతా పడి చెల్లాచెదురయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాయపడ్డ సాయిని 108 అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. సుబ్బారావు మతదేహాన్ని శింగరాయకొండ ఎస్ఐ ఫిరోజా ఫాతిమా పరిశీలించి వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఎస్సై ఫిరోజా ఫాతిమా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మార్కాపురంలో భారీ చోరీ

80 తులాల బంగారం అపహరణ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని రాజాజీవీధిలో (అమ్మవారిశాల బజారు) శనివారం అర్థరాత్రి సమయంలో భారీ చోరీ జరిగింది. సుమారు 80 తులాల బంగారు బిస్కెట్లు అవహరణకు గురయ్యాయి. దీంతో ఇంటి యజమాని గురువర్ధన్ కుటుంబీకులు లబోదిబోమంటున్నారు. కుమార్తె వివాహం కోసం ఆభరణాలు తయారు చేయించుకోవాలని ఇటీవలే కొనుగోలు చేసి తమ వస్త్ర దుకాణంలోని బీరువాలో దాచుకున్నారు. వారు నివాసం ఉండేది కూడా అక్కడే. రాత్రి సమయంలో షాపునకు తాళం వేసుకుని దుకాణం పైఅంతస్తులో నిద్రించారు. ఈ విషయం గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. చోరీ జరిగిన విషయాన్ని పట్టణ పోలీసులకు బాధితులు తెలిపారు. మార్కాపురం సిఐ ఎం భీమానాయక్, పట్టణ ఎస్ఐ శశికుమార్‌లు సంఘటనా స్థలాన్ని ఆదివారం ఉదయం పరిశీలించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ జరిగిన షాపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదు పొందాలి: ముత్తుముల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులు విద్యతో పాటు మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదు పొందాలని మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక హరిప్రియ ఫంక్షన్ హాలులో సిద్ధార్థ కరాటే అకాడమీ 41వ వార్షికోత్సవం సందర్భంగా అంతర్రాష్ట్ర కరాటే ఛాంపియన్‌షిప్ ఆదివారం ప్రారంభమైంది. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల పలు జిల్లాల నుంచి 450కి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌లో తర్ఫీదు పొందాలని, భవిష్యత్తులో చదువుకు మార్షల్ ఆర్ట్స్ సర్టిఫికెట్లు అదనపు అర్హతను జత చేస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవ సలహాదారులు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో మొట్టమొదటిగా కరాటేను పరిచయం చేసింది నల్లూరి మోహనరావు అని, వేలాదిమంది కరాటే క్రీడాకారులను తయారు చేశారన్నారు. పోలీస్, ఇతర శాఖలలో శిక్షణ ఇచ్చిన ఘనత నల్లూరి మోహనరావుకు దక్కుతుందన్నారు. ఒంగోలు ట్రాఫిక్ డిఎస్పి విక్రమ శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న వయసు నుండే శారీరక దారుఢ్యం పట్ల యువత దష్టి సారించాలన్నారు. ఆత్మరక్షణకు కరాటేకి మించిన గొప్ప ఆయుధం మరొకటి లేదన్నారు. పోటీలు అనంతరం గెలుపొందిన విద్యార్థులకు శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివద్ధి కమిటీ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు, ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుర్రా భాస్కరరావు, వివిధ రాష్ట్రాల నుంచి ఇంటర్నేషనల్ రెఫరీలు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడు రైల్వే స్టేషన్‌లో రైలు కిందపడి వ్యక్తి మృతి చెందారు. మృతి చెందిన వ్యక్తి మార్కాపురం మండలం బోడపాడు గ్రామానికి చెందిన బొగ్గు లక్ష్మిరెడ్డి తండ్రి పెద్దరాజారెడ్డిగా సంఘటన స్థలంలో లభ్యమైన ఆధార్ కార్డు ద్వారా గుర్తించినట్లు సమాచారం. శనివారం రాత్రి 9:51 గంటల సమయంలో నంద్యాలలో మార్కాపురం వచ్చేందుకు టిక్కెట్ కొనుగోలు చేసి ప్రయాణించినట్లు మృతుడు లక్ష్మిరెడ్డి వద్ద లభ్యమైన టికెట్ ద్వారా గుర్తించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిని రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: కుటుంబం సమస్యలతో మనస్తాపానికి గురైన ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఈ ఘటన మండల పరిధిలోని వీరయపాలెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి నల్లబోతుల వెంకయ్య పురుగుల మందు తాగాడు. అనంతరం 100కి ఫోన్ చేసి తాను పురుగు మందు తాగినట్లు తెలిపారు. పోలీస్ కంట్రోల్ రూమ్ అధికారులు వెంటనే స్పందించి స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన యర్రగొండపాలెం ఎస్ఐ జి కోటయ్య తన సిబ్బందితో కలసి ఐటీ కోర్ టీమ్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నల్లబోతుల వెంకయ్య ఉన్న లొకేషన్ తెలుసుకున్నాడు. వెంకయ్య వీరాయపాలెం గ్రామ శివారులో ఉండగా గ్రామస్తుల సహాయంతో యర్రగొండపాలెంలోని రవీంద్ర నర్సింగ్ హోంలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. వెంకయ్య ఆత్మహత్యకు పాల్పడకుండా కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలను కాపాడిన యర్రగొండపాలెం ఎస్ఐ జి కోటయ్య, ఐటి కోర్ ఎస్ఐ కె అజయ్ కుమార్, పోలీసు సిబ్బంది అహరోన్, రమేష్ నాయక్, ఐటి కోర్ సిబ్బందిని ఎస్‌పి మల్లికగర్గ్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఐటిసి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-చీరాల: రోడ్డు ప్రమాదంలో ఐపీసీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఈపురిపాలెం పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పేరాల జక్కావారి వీధికి చెందిన గుంటి సోమసుందర్(45) ఐటిసి కార్మికుడు. అయితే ఆదివారం విధులు ముగించుకుని బాపట్ల వెళ్లి రాత్రి తిరిగి పేరాల ఇంటికి వస్తుండగా ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ సమీపంలోని ఐటిఐ కళాశాల ఎదురుగా ఎదురుగా వడ్ల లోడుతో వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఇతడిని ఢీకొంది. ప్రమాదంలో సోమసుందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు సంతానం. సోమసుందర్ కూడా వారి నాన్నకు ఒక్కడే సంతానమని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కుటుంబానికి జీవనాధారమైన కార్మికుడు సోమసుందర్ మృతితో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీర వుతున్నారు. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



మృతిచెందిన కార్మికుడు సోమసుందర్

చిరు వ్యాపారులకు రోటరీ క్లబ్ చేయూత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సౌజన్యంతో స్థానిక బిఎంఆర్ అర్జున్ ఇన్‌ఫ్రాలో చిరువ్యాపారుల ఆర్థికాభివద్ధికి తోపుడుబండ్లు పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఒంగోలు రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ ఎనిమిది మంది బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారికి ఒక్కొక్కటి దాదాపు 16 వేల రూపాయల వ్యయం కలిగిన ఈ తోపుడుబండ్లను అందజేశారు. ముఖ్యఅతిథులుగా గనిపినేని హరనాథ్‌బాబు, కార్పొరేటర్ చెన్నుపాటి వేణు గోపాల్, బిఎంఆర్ శంకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాసరావు, సెక్రటరీ మాకినేని మురళీ కష్ణ, కోశాధికారి గుండపనేని గోపీకిషోర్, సభ్యులు కోగంటి గోపాలకష్ణ, గుమ్మడి శ్రీధర్, మాలెంపాటి కృష్ణారావు, నర్రా సురేంద్ర బాబు, సీనియర్ సభ్యులు లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

షార్టు సర్క్యూట్‌తో కాలిపోయిన ఇల్లు

రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం

ప్రజాశక్తి-అద్దంకి

మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంటిలోని విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. గృహ యజమానులు పొలం పనులకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఇంటిలో ఉంచిన రూ.15 వేలు నగదు, దాదాపు 5 సవర్ల బంగారం కూడా దగ్ధమైనట్టు సమాచారం. వంట పాత్రలు, బట్టలు కూడా పూర్తిగా కాలిపోయాయి. గృహ యజమాని మన్నేటి వెంకటేశ్వర్లు ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులు కూలి పనులకు వెళుతున్నారు. స్థానికులు మంటలను గమనించి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించిన ఫలితం దక్కలేదు. ఆస్తి నష్టం రూ.4 లక్షలు ఉండవచ్చని చెబుతున్నారు.



కాలిపోయిన వస్తువులు

పేకాట స్థావరాలపై పోలీస్ పంజా

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

మండలంలోని ఛందోలు గ్రామ పరిధిలో పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రాజశేఖర్ తన సిబ్బందితో ఆకస్మిక రైడ్ నిర్వహించారు. ఈ రైడ్‌లో 10 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.14,800 డబ్బులు సీజ్ చేశామని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ల రాపిడితో ఏర్పడిన నిప్పు రవ్వల కారణంగా 4 గడ్డి వాములు దగ్ధమైన సంఘటన మండలంలోని కొంగలవీడు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని కొంగలవీడు గ్రామంలో విద్యుత్ లైన్ల రాపిడివల్ల ఏర్పడిన నిప్పు రవ్వలతో అక్కడే వున్న 4 గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా హుటాహుటిన చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. కానీ ఇంతలోపే గడ్డి వాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. గడ్డివాములు నష్టపోయిన రైతులు సూరా పాండురంగారెడ్డి, సూరా స్వామి రంగారెడ్డి, సురా శ్రీనివాసరెడ్డి ప్రభుత్వం తమకు సహాయం అందించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థికి యుఎంహెచ్ఇయు మద్దతు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు ప్రకటించింది. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ప్రభుత్వ రంగంలో వైద్యారోగ్య రంగాన్ని బలపరిచే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి మద్దతు తెలియజేశారు. సమావేశానికి నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో వైద్యారోగ్య రంగం బలపడాల్సిన అవసరం ఉందని, బలపరిచే వ్యక్తులని ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. మీగడ వెంకటేశ్వరరెడ్డిని వైద్య, ఆరోగ్య ఉద్యోగులందరూ బలపరచాలని, వారికి యూనియన్ పూర్తి మద్దతు తెలియజేస్తుందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు మంత్రునాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందాం

అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పి బాబురెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి-చీరాల

ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా సమాజంలో ఉన్న పేదలు, కార్మికులు, కష్టజీవుల సమస్యలపై శాసనమండలిలో ప్రస్తావిస్తూ ప్రజల పక్షాన ఉండి పోరాటాలు నిర్వహించే పిడిఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పి బాబురెడ్డిలను గెలిపించుకుంటేనే ప్రజల సమస్యల పరిష్కారం జరుగుతుందని ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నేతలు అన్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుంచి పట్టణంలోని వివిధ వార్డుల్లో వివిధ గ్రూపులుగా ఏర్పడి తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థులు అయిన మీగడ వెంకటేశ్వర రెడ్డి, పి బాబురెడ్డిలను గెలిపించాలని కోరుతూ ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా యూటీఫ్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ గతం నుంచి పిడిఎఫ్ అభ్యర్థులు గెలిచి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుటంలో విఫలం అయిందని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు సమస్యలు శాసన మండలిలో చర్చకు రావాలి అంటే అది పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు ద్వారానే సాధ్యమని అన్నారు. కావున పిడిఎఫ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్న వెంకటేశ్వరరెడ్డి తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థిగా, పి బాబురెడ్డి ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని కోరారు. వీరు ఇరువురు కూడా ఉద్యోగ ఉపాధ్యాయుల పక్షాన ఉండి పోరాటాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కావున ఉద్యమ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా మన హక్కులు కాపాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, బి బిక్షాలు, ఎస్‌కె జానీ బాషా, కే శీను, కె వీరాంజనేయులు, కె రామారావు, వెలుగొండారెడ్డి, సుబ్బారెడ్డి, రాజేష్, వసంతరావు, బాబురావు, టి కృష్ణమోహన్, మణిలాల్, అగస్టీన్, సుధాకర్, మనోజ్, కిరణ్, టి సురేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు

పంగులూరు: శాసనమండలి ఎన్నికల్లో ప్రజాసమస్యల పట్ల అవగాహన కలిగి, శాసనమండలిలో మాట్లాడగలిగే పిడిఎఫ్ అభ్యర్థుల్ని గెలిపించాలని, బాపట్ల జిల్లా రైతు సంఘం కార్యదర్శి తలపనేని రామారావు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, మండలంలోని కొండ మంజులూరు గ్రామంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు, రావుల బాపయ్యతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా, గ్రామంలోని నిరుద్యోగ యువకులు, ఉద్యోగులు, గ్రాడ్యుయేట్స్‌తో ఆయన మాట్లాడారు. శాసనమండలి ఏర్పడిన గత 18 సంవత్సరాలలో అనేక సమస్యలపై పిడిఎఫ్ అభ్యర్థులు మాట్లాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు జరపటంలో పూర్తిగా విఫలమైందని, ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి వాటన్నిటినీ మర్చిపోయాడని రామారావు చెప్పారు. శాసనమండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యులు సమస్యల జోలికి పోవటం లేదని, కేవలం వారి వ్యక్తిగత పనులు చూసుకోవడానికి పదవులను ఉపయోగిస్తున్నారని అన్నారు. అందువలన తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజవర్గం పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన మీగడ వెంకటేశ్వరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు రావుల బాపయ్య మాట్లాడుతూ, నిస్వార్థంగా ప్రజల సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రజల కోసమే పిడిఎఫ్ అభ్యర్థులు పనిచేస్తారని పేర్కొన్నారు. స్వార్థం పెరిగిపోతున్న ఈ రోజుల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసనమండలిలో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వాన్ని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల్ని నిలదీసే పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని అన్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కరణం రామారావు, వీరవల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కొండమంజులూరులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

గుర్తుకొస్తున్నాయి..

- పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం
- 33 ఏళ్ల తరువాత కలుసుకున్న నిజాంపట్నం జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-నిజాంపట్నం

పూర్వ విద్యార్థులు ప్రయోజకులైన తర్వాత ఒక వేదికన అందరూ కలుసుకోవడం ఒక అపురూప దృశ్యం. స్కూల్ రోజులు పూర్తయిన పిదప అందరూ మళ్లీ ఒక చోట కలుసుకోవడం చాలా అరుదు. ప్రతి మనిషి జీవితంలో బాల్యం అనేది మరువలేనిది. అది ఒక తీపి గుర్తు. పాఠశాల దశలో చేసిన అల్లరి చిల్లరి పనులు, తోటివారిని ఏడిపించడం, మాస్టర్ చేతిలో దెబ్బలు తినడం, చీవాట్లు పడటం, ఇదంతా చెబితే పెద్ద గ్రంథమే. స్నేహితులందరూ ఒక వేదికగా కలుసుకోవడం అనే ఆలోచన చాలా అభినందనీయం. అలాంటి ఆత్మీయ నేస్తాలు ఆదివారం కలిశారు. 33 సంవత్సరాల తరువాత కలవడంతో పెద్ద పండుగ వాతావరణమే నెలకొంది. నిజాంపట్నం జడ్‌పి ఉన్నత పాఠశాల టెన్త్ టైటాన్స్ 1988-89 బ్యాచ్ ఆదివారం నిజాంపట్నం బీచ్ వద్ద కలుసుకున్నారు. ఒకరి బాగోగులు ఒకరు తెలుసుకున్నారు. తమ 33 ఏళ్ల ప్రస్థానం, చిన్ననాటి మిత్రుల ఆలింగనాలు, కరచాలనాలు,స్నేహితులకు పెట్టుకున్న నిక్ నేమ్స్‌తో మళ్లీ వాళ్లని పిలవడం, కల్మషం లేని మనసుతో మాట్లాడుకోవడం, అందరితో పంచుకునే పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో సముద్ర తీరం ఆహ్లాదకర వాతావరణంతో కనువిందు చేసింది. ఎంత ఎత్తుకు ఎదిగినా చిన్ననాటి మిత్రుల ముందు ఎదుగుదల శూన్యం. ఎక్కువ, తక్కువ తారతమ్యాలు కనపడవు. ఒకరికొకరు తోడుగా వున్న సందేశమే పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం. అపూర్వం మన కలయిక, అద్వితీయం మన స్నేహం.. అనే స్నేహితుల నినాదాలు సముద్రపు ఘోషకు తోడై తీరాన్ని హోరెత్తించాయి. చిన్ననాటి స్నేహితులంతా తీరంలోనే మధ్యాహ్న భోజనం చేశారు. సమ్మేళనంలో ప్రసాదం వాసుదేవ, నర్రా నాగేశ్వరరావు, మోపిదేవి నాగరాజు, సరళ కుమార్, నీలా బాలకోటేశ్వరరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, శ్రీరామమూర్తి, అబ్దుల్ సలీం 1అండ్2, కాళేపల్లి శ్రీనివాసరావు, జిడుగు రాజా, కొత్తగుండు శ్రీధర్, గీతావాణి, నాళం పద్మజ, గ్రంథి భవాని, మల్లీశ్వరి, బెల్లంకొండ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల తాజా జ్ఞాపకం.. బృంద ఛాయాచిత్రం

ఏజీ కాలేజీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-బాపట్ల

యాభై ఏళ్ల క్రితం వ్యవసాయ విద్యను పూర్తి చేసుకుని అనేక రంగాల్లో స్థిరపడిన వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థులు అర్ధ శతాబ్దం అనంతరం ఆత్మీయ అనుబంధాన్ని పంచుకున్నారు. ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో 1968-72 బీఎస్సీ(ఏజి) పూర్వ విద్యార్థులు యాభై యేళ్ళు పూర్తైన సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని తమ జీవితానుభవాలను పంచుకున్నారు. ఏడు పదుల వయస్సు పైబడిన యాభై మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ సమ్మేళనకు హాజరయ్యారు. సుదీర్ఘకాలం అనంతరం కళాశాల పూర్వ విద్యార్థుల కలయిక వారిలో ఆనందోత్సాహాలను నింపింది. వ్యవసాయ విద్య పూర్తి చేసినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో ఉద్యోగాల జోలికి వెళ్లనివారు కొందరైతే.. వ్యాపారం, ఇతర వృత్తులలో స్థిరపడినవారు మరికొందరు. వారు తమ అనుభవాలను ఒకరినొకరితో పంచుకున్నారు. వివిధ రంగాల్లో ఖ్యాతినార్జించిన పూర్వ విద్యార్థులు బెల్లం కోటయ్య (పొగాకు ఎగుమతులు), కె శ్రీమన్నారాయణ, బుల్లి గురవయ్య, నాగరాజు, ఏ చంద్రశేఖర్ లను కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. సమ్మేళనానికి హాజరైన వారికి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో 1968 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఉల్చి శంకర్రావు, యు వెంకట్రావు, శ్రీ వాణి ప్రసాద్, బి శ్రీమన్నారాయణ, బెల్లం కోటయ్య, పూర్వ విద్యార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నాటి వ్యవసాయ విద్యార్థుల బృంద ఛాయాచిత్రం

కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని అద్దేపల్లి గ్రామంలో ఆదివారం ఎంపియుపి పాఠశాలలో చేరుకుపల్లికి చెందిన కామాక్షి ఐకేర్ సెంటర్ సహకారంతో చర్చి పాస్టర్ తిమోతి ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి పైగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అద్దేపల్లి పరిసర ప్రాంత ప్రజలు ఈ శిబిరాన్ని వి నియోగించుకున్నట్లు తిమోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వాసుదేవరావు, పాఠశాల హెచ్‌ఎం భరతుల శ్రీధర్, ఉపాధ్యాయులు హావేల ప్రశాంతి, బాపూజీ, వైద్య బృందం పాల్గొన్నారు.



ఓరుగంటి వారిని సత్కరిస్తున్న ఘంటసాల మరదలు వర్ధనమ్మ

గాన గాంధర్వులు ఓరుగంటి వారు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లుకు చెందిన ఓరుగంటి సత్యనారాయణ శాస్త్రి, ఆయన తనయుడు వెంకటేశ్వరశాస్త్రి ఇరువురూ గాన గాంధర్వులుగా పేరు పొందారని ఘంటసాల మరదలు దండిభొట్ల వర్ధనమ్మ కొనియాడారు. తిమ్మసముద్రం గ్రామంలోని షిరిడీ సాయిబాబా మందిరం వార్షికోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తిగీతాలు ఆలపించిన వెంకన్నశాస్త్రికి గీతాజ్ఞాన యజ్ఞ శిరోమణి అవార్డును ఇచ్చి సత్కరించారు. జంధ్యాల రమణమూర్తి పంతులుగారి చేతుల మీదుగా అవార్డును, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఓరుగంటి దుర్గ, చిలుకూరి శ్రీనివాసరావు, పుల్లయ్య, గద్దె కోటేశ్వరరావు, వెంకట్రావు, గుంజి రాంబాబు, చందలూరు కోట శాస్త్రి, జరుగుల మురళి, సుబ్బారావు, శివయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ వికె భాస్కరరావు అన్నారు. ఆదివారం స్థానిక సందీప్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన సైన్స్ ప్రదర్శన కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే నూతన ఆలోచన విధానాన్ని అవలంబించుకోవాలని తద్వారా విద్యార్థులను మంచి దిశగా అడుగులు వేసేందుకు ఎంతగానో కృషి చేస్తోందని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలను ఆయన పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

ఈత పోటీలో అలకాపురం వాసికి మూడో స్థానం

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

మండలంలోని అలకపురం గ్రామ వాసి, గుంటూరు ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం స్విమ్మర్ హర్షవర్ధన్ తాను ఎంచుకున్న రంగంలో రాణిస్తూ పతకాలను కైవసం చేసుకొని తన గ్రామానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తున్నాడు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ వారి ఆధ్వర్యంలో కృష్ణా నదిలో విజయవాడ వైపు ఉన్న దుర్గ ఘాట్ నుంచి గుంటూరు వైపు ఉన్న లోటస్ ఫుడ్ సిటీ దాకా ప్రకాశం బ్యారేజీకి ఆనుకొని ఆదివారం ఈత పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా 1.5 కిలోమీటర్ల విభాగంలో కృష్ణా నది దాటడంలో అలకపురం గ్రామ వాసి, ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియం విద్యార్థి బి హర్ష వర్ధన్ రాజు, 11 నుంచి 18 సంవత్సరాల విభాగంలో పాల్గొని 16:34:37 నిముషాలలో పూర్తి చేసి మూడో స్థానం సాధించాడు. అతడు విజయం సాధించటంలో సహాయ పడిన కోచ్ ఖాజామొహిద్దీన్‌ను, విజేత అయిన హర్షవర్ధన్‌ను గ్రామ సర్పంచ్ గంగరాజు, ఖాజీపాలెం గ్రామ వైసీపీ నాయకులు దేవేందర్ రాజు, మండల ఉపాధ్యక్షుడు రామరాజు అభినందించారు.



సర్టిఫికెట్లతో హర్షవర్ధన్

రేషన్‌కార్డులో పేరు చేరాలంటే...


కాళ్లు అరుగుతున్నాయి

- అవకాశం కల్పించినా తప్పని అడ్డంకులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది. కొత్తకార్డు కావాలన్నా, మార్పు జరగాలన్నా వివిధ రకాల ధ్రువపత్రాలు, అనుబంధ పత్రాలు అవసరమని పేర్కొన్నారు. దీంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక పరమైన చిక్కులు, కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా కార్డు దక్కడం లేదని ప్రజలు వాపోతున్నారు.

యర్రగొండపాలెంకు చెందిన ఓ యువకుడికి మార్కాపురానికి చెందిన యువతితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. తన కార్డులో భార్య, పిల్లల పేర్లు చేర్చాలని ఆ యువకుడు కోసం దరఖాస్తు చేసుకునేందుకు యర్రగొండపాలెం-2 సచివాలయానికి వెళ్లాడు. సచివాలయ సిబ్బంది వివాహ ధ్రువపత్రం కావాలని చెప్పారు. దాని కోసం రిజిస్ట్రారు కార్యాలయానికి వెళ్లగా వయసు నిర్ధారణకు ఆధార్, స్టడీ సర్టిఫికెట్ అడిగారు. వివాహం అయినట్లు పెళ్లి కార్డు, పెళ్లి నాటి ఫొటోలు అడిగారు. దీంతో యువకుడు 1998లో చదివిన పాఠశాలకు వెళ్లి స్టడీ సరిఫికెటు తీసుకొచ్చాడు. ఇన్ని ఇబ్బందులు పడి ధ్రువీకరణ పత్రం తీసుకొస్తే యువతి పేరు తన తల్లిదండ్రుల రేషన్ కార్డులో ఉందని, అక్కడ తొలగించాక రమ్మని చెప్పి పంపిం చారు. యువతి తమ గ్రామ సచివాలయానికి వెళ్తే మీ తల్లిదండ్రుల కార్డు నుంచి ఎప్పుడో పేరు తొలగించారని చెప్పారు.



గతంలో కార్డుల్లో మార్పులు ఇలా..

కార్డులో మార్పులకు పెట్టు కున్న దరఖాస్తులను సంబంధిత విఆర్‌ఒలు పరిశీలించి నివాస ధ్రువపత్రం మంజూరు చేసేవారు. దీన్ని సంబంధిత కార్యాలయంలో సమర్పిస్తే కుటుంబ సభ్యులుగా గుర్తించి కార్డులో వారి పేర్లు చేర్చేవారు. పేరు తొలగించాల్సి వస్తే అందుకు అవసరమైన కారణాలను నిర్ధారించే ధ్రువపత్రం సమర్పిస్తే పని పూర్తయ్యేది. ఇప్పుడు చేర్పులు, మార్పులు జరగాలంటే కాళ్లు అరిగి పోవాల్సిందే.

తప్పని అడ్డంకులు..

భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళలకు ప్రభుత్వం పథకాలు అందిస్తోంది. వీటిని పొందాలంటే ఒంటరిగా ఉన్నట్లు రేషన్‌కార్డు తప్పని సరి. చాలా మందికి భర్తతో కలిసి ఉన్న కార్డులే ఉన్నాయి. కొత్త దాని కోసం వెళ్తే విడాకుల ధ్రువపత్రం అడుగుతున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో విడిపోయిన వారికి పత్రాలు తీసుకు రావడం సాధ్యం కావడం లేదు.

అదనపు ఖర్చు..

వివాహ ధ్రువపత్రం కావాలంటే ప్రభుత్వ చలానాగా రూ.200 చెల్లించాలి. బయట ఖర్చులు రూ.2 వేల వరకూ అవుతున్నట్లు బాధితులు చెపుతున్నారు. పెళ్లై ఎక్కువ సంవత్సరాలు అయిన వారికి పత్రాలు కావాలంటే దంపతుల విద్యార్హత, స్టడీ సర్టిఫికెట్లు, పెళ్లి ఫొటో, ఆహ్వాన పత్రిక జతచేయాల్సి ఉంటుంది. నిరక్షరాస్యులకు వయసు నిర్ధారణ పత్రాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎముకల వైద్యుల నుంచి తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో లేకపోవడంతో జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లాల్సిన పరిస్థితి. దీని కోసం రూ. వేలల్లో ఖర్చవుతున్నట్లు చెబుతున్నారు.

ఇద్దరు పిల్లల్ని కార్డులో చేర్చలేదు

తాటి నాగేశ్వరరావు, వేగినాటి కోటయ్య నగర్



రేషన్ కార్డులో ఇద్దరు పిల్లల్ని చేర్చాలని ఏడాది నుంచి తిరుగుతున్నా. పెద్దమ్మాయి వయస్సు ఏడు సంవత్సరాలు. చిన్న అబ్బాయి వయస్సు ఐదు సంవత్సరాలు. ఆధార్ కార్డు తీసుకు రామ్మన్నారు. ఆ తర్వాత బర్త్ సర్టిఫికెట్ తీసుకురామన్నారు. ఇవ్వన్నీ తీసుకెళితే సర్వేలో పిల్లల పేర్లు లేవంటున్నారు. రేషన్ కార్డులో పిల్లల పేర్లు చేర్చుకునేందుకు కాళ్లరిగేలా తిరుతున్నా.

పింఛను రావడం లేదు

ఉసుళ్ల చిన్న వెంకటేశ్వర్లు, యర్రగొండపాలెం



అమ్మ కార్డులో నేను, మా అమ్మ ఉన్నాం. అమ్మకు వృద్ధాప్య పింఛను వస్తుంది. నేను హిజ్రాను. ప్రభుత్వం నాకు కూడా పింఛను అవకాశం కల్పించింది. ఒకే రేషన్ కార్డులో ఇద్దరం ఉండడం వల్ల నాకు పింఛను రావడం లేదు. సపరేటు రేషన్ కార్డు కోసం రోజూ తిరుగుతున్నా పని కావడం లేదు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో...

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కంభం రూరల్

నీతి, నిజాయతీ, నిబద్ధతతో పని చేసే పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని యుటిఎఫ్, జెవివి, సిఐటియు నాయకులు కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబు రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు ఆవుల సుబ్బారెడ్డి, అధ్యక్షుడు మీనిగె ప్రసాద్, కార్యదర్శి పి.పాండు, యుటిఎఫ్ నాయకులు మూలే శ్రీనివాసరెడ్డి, ఆర్.నారాయణ, జెవివి మండల కార్యదర్శి ఎన్‌వి. రమణారెడ్డి, నాయబ్ రసూల్, సిఐటియు నాయకులు తోట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడకు అంగన్‌వాడీల మద్దతు

పొదిలి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మద్దతు ఇస్తూ తీర్మానించినట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లాస్థాయి సమావేశం వై.సత్యవతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, కనీస వేతనాల కోసం మద్దతుగా నిలబడుతున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం కంటే అంగన్‌వాడీలకు మన రాష్ట్రంలో రూ.1000 అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి తన మాట నిలుపుకోలేదన్నారు. అంగన్‌వాడీలను కార్మికులుగా గుర్తించి గ్యాట్యుటీ ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా రాష్ట్రంలో అమలుకు నోచలేదని తెలిపారు. స్కీం వర్కర్లపై పని భారం పెరిగిందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల హక్కులను హరిస్తున్న స్థితిలో చట్టసభల్లో ఉద్యోగుల వాణిని వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉద్యోగ, కార్మికులపై ఉందన్నారు. కాంటాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం వారిపట్ల ప్రభుత్వ ఉదాసీనతకు నిదర్శనమన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చి మాట తప్పిన సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.కల్పన, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పోలమ్మ, అజిత, శోభ, పద్మ, ప్రజావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈదర అన్నపూర్ణ



మాట్లాడుతున్న జివి కొండారెడ్డి

ప్రయివేటు ఉపాధ్యాయులను ఉద్ధరిస్తామనడం హాస్యాస్పదం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొండారెడ్డి

ప్రజాశక్తి-కనిగిరి

ప్రయివేటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించలేదని, రాష్ట్ర ప్రభుత్వం వారిని ఉద్ధరి స్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి. కొండారెడ్డి విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం కనిగిరి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పిసి.కేశవరావు అధ్యక్షతన కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జివి. కొండారెడ్డి మాట్లాడుతూ గత మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నిర్దిష్టమైన నిబంధనలతోఓటు హక్కు కలిగి ఉన్నట్లు తెలిపారు. అయితే వారికి ఓటుహక్కు తీసుకొచ్చింది తామే అని చెప్పుకోవటం సరికాదన్నారు. యుడైస్,పిఎఫ్,బ్యాంక్ అకౌంట్ నెంబర్లు మ్యాచ్ కాకుండానే వైసిపి అక్రమంగా అనేక ఓట్లను చేర్పించినట్లు ఆయన విమర్శించారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో రెన్యూవల్ పిరియడ్ 10 సంవత్సరాలుగా ఉండగా 3 సంవత్సరాలకు కుదించిన వైసిపి మళ్లీ 10 సంవత్సరాలకు పొడిగిస్తామని చెప్పటం వారిని మోసం చేయటమేనని తెలిపారు. హామీలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకొనే వైసిపి ప్రభుత్వం ప్రయవేటు విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులకు కనీస వేతనాలు అమలు, ఉద్యోగ భద్రత, హెల్త్ పాలసీలు, గుర్తింపు కార్డులు లాంటి సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. ఇప్పుడు ఉద్ధరిస్తామని చెప్పటం వారిని మోసం చేయడమేని తెలిపారు. కరోనా సమయంలో తెలంగాణా ప్రభుత్వం ప్రయివేటు స్కూల్ సిబ్బందికి ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం వారి గురించి పట్టించుకోలేదని తెలిపారు. కరోనా సమయంలో చిన్న పరిశ్రమలకు రాయితీలు ఇచ్చినట్లు తెలిపారు. మూతబడిన ప్రయివేటు విద్యాసంస్థలకు కనీసం విద్యుత్ బిల్లుల్లో కూడా రాయితీ ఇవ్వలేదని విమర్శించారు. కార్పొరేట్ పక్షంగా వ్యవహరిస్తున్న వైసిపి పభుత్వం తీరును ప్రయవేటు విద్యాసంస్థలు,ఉపాధ్యాయులు వ్యతిరేకించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం కనిగిరి ప్రాంతీయ కమిటీ నాయకులు రాయళ్ల మాలకొండయ్య, బడుగు వెంకటేశ్వర్లు, పి.మహేష్, వి. మాలకొండారెడ్డి, జి.శ్రీను, ఎస్‌కె. బషీరా,ఎస్‌కె. ఖాదర్‌వలి పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

వైసిపికి చరమగీతం పాడాలి

ప్రజాశక్తి-సిఎస్‌పురం

వైసిపి పాలనకు చరమగీతం పాడాలని టిడిపి మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, మాజీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా తెలిపారు. మండల పరిధిలోని విబైలు, బోయమాడుగుల,గ్రామ పంచాయతీలలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని సైకో పాలనను అంత మొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌పురం సర్పంచి శీరాం పద్మావతి, టిడిపి నాయకులు మాలకొండయ్య, పి.రవికుమార్, సారే వెంకట సుబ్బయ్య, రజ్జబ్‌బాషా, జె.లక్ష్మి, బి.వెంకటాద్రి, దెవెండ్ల తిరుపతయ్య, వెంకటరెడ్డి, కె.వెంకటకొండయ్య, దొర తిరుపతయ్య, రంగస్వామి, దాసరి మల్లికార్జున, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దత్తత గ్రామంలో నీటికి కటకట

- అవస్థలు పడుతున్న ప్రజలు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ఎమ్మెల్యే దత్తత గ్రామమైన కొనకనమిట్ల మండలం మునగపాడు పంచాయతీ పరిధిలోని బసవాపురం గ్రామస్తులు 20 రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రమైన కొనకనమిట్ల గ్రామానికి చివారు గ్రామం ఇది ఈ గ్రామంలో 40 కుటుంబాల వారు నివశిస్తున్నారు. అందరూ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు. గ్రామంలో చేతి పంపులు ఒట్టిపోయాయి. వాటి నుంచి రావడం లేదు. సోలార్ సిస్టం ద్వారా డీప్‌బోరుకు వచ్చే నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో నీటి సమస్య ఏర్పడింది. ఈ గ్రామంలో అందరూ వ్యవసాయ కూలీలు. గతంలో ఇక్కడ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. పంచాయతీలో నిధులు లేవని, గతంలో చేసిన పనులకే బిల్లులు రాలేదని సర్పంచి చెబుతున్నారు. దీంతో సమస్య గురించి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని బసవాపురం వాసులు వాపోతున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న చేతిపంపులో వచ్చే అరకొర నీటినే తాగడానికి, ఇతర అవసరాలకు వినియోగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. ఆర్థికస్థోమత, బైకు కలిగిన వారు తమ గ్రామానికి నాలుగు కిలో మీటర్ల దూరంలోనున్న మునగపాడు గ్రామంలోని వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్ళి 20లీటర్లు రూ.10ల కొనుగోలు చేసి తెచ్చుకొని తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు కలుషిత బోరు నీటినే తాగాల్సిన దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యే దత్తత గ్రామంలోనే నీటి సమస్య ఇలా ఉంటే ఇతర గ్రామాలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని బసవాపురం గ్రామస్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన సోలార్ డీప్‌బోరు



అలంకారప్రాయంగా దర్శనమిస్తున్న డీప్‌బోరు

పథకాలు ప్రజలకు చేరువ కావాలి

ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు చేరువ చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా వైసిపి పొదిలి మండల మాజీ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా వైసిపి కార్యాలయంలో కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం కీలకం అన్నారు. పార్టీలోని వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి రాబోవు ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు గృహ సారథులు, వాలంటీర్లతో కలసి ఇంటింటీ కితిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించాలన్నారు. తనకు జిల్లా సేవాదళ్అధ్యక్ష పదవి వచ్చేందుకు సహాకరించిన ఎమ్మెల్యే నాగార్జున రెడ్డిని సంజీవరెడ్డి గజమాలతో సత్కరించారు. అనంతరం గుజ్జులకు ఎమ్మెల్యే మిఠాయి తినిపించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ జూపల్లి ఏడుకొండలు, జిల్లా ఆహార సలహా సంఘం సభ్యులు కొండ్రగుంట సుబ్బారావు, వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షురాలు ఎస్‌కె.నూర్జాహాన్ బేగం, వైసిపి నాయకులు గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, జి.శ్రీను, గూడూరి వినోద్ కుమార్, మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు, పులగొర్ల శ్రీనివాసులు, పేరం కోదండ రామిరెడ్డి, దోర్నాల నారాయణ రెడ్డి, ఫిరోజ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి సహకరించాలి

వరికూటికి యానాది కాలనీ వాసుల వినతి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పంచాయతీ వెంకటాయపాలెం పరిధిలోని ఎస్‌టి కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబుకు కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. వెంకటాయపాలెం యానాది కాలనీ వాసుల సమస్యలు తెలుసుకు నేందుకు వరికూటి అశోక్ బాబు ఆదివారం కాలనీలో పర్యటించాడు. ఈ సందర్భంగా కాలకాలనీవాసులు తమ సమస్యలను విన్నవించారు. అనేక సంవత్సరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్నప్పటికీ కాలనీ ప్రజలందరికీ ఉపయోగపడే కమ్యూనిటీ హాల్ లేదని తెలిపారు. నిర్మాణానికి సహకరించాలని విన్నవించారు. స్పందించిన వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ త్వరలోనే కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మించేలా చర్యలు తీస ుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైసిపి సీనియర్ నాయకులు బీనీడి ఉదయ్ కుమార్, ఆర్యవైశ్య నాయకులు పేరూరి కమలాకర్, సూదనగుంట వెంకట స్వామి, బొడ్డు రవీంద్ర, తన్నీరు చిన్న వీరనారాయణ, దుగ్గిరాల పేర్రాజు, దాసరి సుబ్బారావు, గహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న వరికూటి అశోక్‌బాబు

వైసిపి పాలనలో బీసీలకు పెద్దపీట

ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

బీసీలకు ఎంతో చేస్తామని చెప్పిన గత పాలకులు మాటలకే పరిమిత ుయ్యారని, సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఆచరణలో బీసీలకు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతను గమనించాలన్నారు. రాజ్యాధికారం దిశగా బీసీలను నడిపి స్తున్నారన్నారు. సంక్షేమంలోనూ బీసీలకు 50 శాతం కేటాయింపులు జరుపుతున్నారన్నారు. మంత్రి వర్గంలోనూ తొమ్మిది మంది మంత్రులు బీసీ వర్గానికి చెందిన వారేనన్నారు. రాజ్యసభలోనూ నలుగురు ఉన్నారన్నారు. మొన్న ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 మంది బీసీలు కావడం గమనార్హం అన్నారు.బీసీ కార్పొరేషన్ ఛైర్మన్‌లు, డైరెక్టర్లు రాష్ట్ర వ్యాప్తంగా 700 మంది వరకు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ ఛైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మ శ్రీనివాస్, కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్, వైసిపి నాయకులు సవ్వాని వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు పిఎల్‌పి. యాదవ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, పిన్నిక చక్రపాణి యాదవ్, మంగమూరి పోలయ్య యాదవ్, ఇల్లూరి రంగస్వామి గౌడ్, తర్లుపాడు మండల వైసిపి నాయకుడు సూరెడ్డి రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి



మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- కంభం

అర్ధవీడు మండలం, అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన 40 కుటుంబాల వారు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో మాజీ సర్పంచులు కువ్వారపు అంకయ్య, పెండ్లి రాజయ్య, ఎస్.మల్లికార్జున, మేషపోగు రాజు, భోగం లింగయ్య, మత్తేపల్లి శిఖమణి, కువారపు అంకయ్య, నల్లబోతుల వెంకటరామయ్య, మంకు నాగయ్య, మాదాసు అంకయ్య, వేశపోగు పెద్దిరాజు, చిలక చిన్న పుల్లయ్య, వేశపోగు సిద్దయ్య, కాకి పౌలు, కోవాకు సత్యానంద్, చిలక పెద్ద పుల్లయ్య, కువారపు నాగయ్య, నాగర్ల విజయ్, వేశపోగు రాజు, వేశపోగు దేవానంద్, పసుపులేటి కాశీ రావు, వేశపోగు కాశయ్య, శ్రీపతి మల్లికార్జున, శ్రీపతి కిట్టయ్య, గోదం నాగరాజు, మాదాసి వెంకటేశ్వర్లు, వేశపోగు బాబు, ముత్యాల పెద్దన్న, కువ్వారపు జాన్, ఎం వెంకటేశ్వర్లు తదితరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొణతం రంగారెడ్డి, బియ్యాల నారాయణ, మారెడ్డి రంగారెడ్డి, గుడిసె పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

గిద్దలూరు రూరల్ : రాచర్ల మండలం చోళ్లవీడు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కనుమర్లపూడి సుబ్బారావుశెట్టి ఆదివారం మతి చెందాడు. ఆయన మృతదేహాన్ని గిద్దలూరు నియోజక వర్గ వైసిపి నాయకుడు పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సుబ్బారావు శెట్టికి నివాళు లర్పించిన వారిలో ఇ.వెంకటరామిరెడ్డి, ఆకవీడు ఎంపిటిసి శంకర్‌రెడ్డి, రంగారెడ్డి, ఎం.వెంకటరామిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

డిఆర్‌ఒను కలిసిన వినోద్‌కుమార్

వెలిగండ్ల : జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేషును ఎస్‌టి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మెంబర్ గూడూరు వినోద్ కుమార్ ఆదివారం మర్యాద పూర్వంగా కలిశారు. ప్రభుత్వం అసైడ్ కమిటీ ద్వారా ప్రతి ఎస్‌సి,ఎస్‌టి కుటుంబానికి రెండు ఎకరాలు భూమి ఇవ్వాలని కోరారు. అందుకు డిఆర్‌ఒ ఓబులేషు సానుకూలంగా స్పందించినట్లు వినోద్‌కుమార్ తెలిపారు. అనంతరం డిఆర్‌ఒను సన్మించారు.. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రామచంద్రప్ప. ఐజా, ఎపి ఎస్‌సి,ఎస్‌టి ఎంప్లాయీస్ జెఎసి నాయకుడు సిహెచ్.జాన్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బరాయుడుకు నివాళి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ఉపాధ్యాయ, కమ్యూనిస్టు నేత గాలి సుబ్బారాయుడు వర్ధంతిని సిపిఐ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఐ, ప్రజా ఆరోగ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత గాలి సుబ్బారాయుడు చిత్ర పటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైద్యశిబిరంలో గుంటూరు జిల్లా శంకర కంటి వైద్య శాల డాక్టర్లు 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 150 మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు నిర్ధారించారు. వారికి త్వరంలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. వైద్యశిబిరానికి వచ్చిన వారికి సిపిఐ బందం ఆధ్వరయంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కష్ణ గౌడ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు చెన్నయ్య, గురునాథం, తిరుమలయ్య, గాలి లక్ష్మి రాజ్యం పాల్గొన్నారు.

కొనసాగుతున్న అధికారి 'అక్రమ' కట్టడం

రెవెన్యూ అధికారులు వచ్చి వెళ్లాక నిర్మాణంలో పుంజుకున్న వేగం ● ఆశ్చర్యపోతున్న స్థానికులు ● మిన్నకుండిన ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-వేటపాలెం

విపత్తులను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా కలెక్టరేట్‌లో ఉండే అధికారి ఆయన. అదే ఆయనకు వరంగా మారింది. మంచికి ఉపయోగిస్తే ఎవరైనా సంతోషిస్తారు. ఆ వరాన్ని అడ్డుపెట్టుకొని పెట్రేగిపోతున్నారు. వెలగపూడి సచివాలయం నుంచి కమిషనర్ ఫోన్ కాల్‌తో స్థానిక అధికారులను భయభ్రాంతులకు గురిచేశారు. అంతే.. బెంబేలెత్తిన వేటపాలెం మండల రెవెన్యూ అధికారులు చటుక్కున వెనక్కు తగ్గారు. ఈ అక్రమం గురించి ఈ నెల 13వ తేదీన 'అక్రమాల అధికారి' శీర్షికన ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించి మండల తహశీల్దారు, విఆర్ఓ, విలేజ్ సర్వేయర్లు వెళ్లి హడావుడిగా కొలతలు తీశారు. ఆ అధికారికి ఫోన్ చేసి ఆఫీసుకు రావాల్సిందిగా కోరారు. విధుల్లో ఉన్న కారణంగా రాలేనన్నారు. సాయంత్రం కల్లా వెలగపూడి సచివాలయం కమిషనర్ నుంచి వార్నింగ్ ఫోన్ కాల్. అంతే జిల్లా అధికారుల నుంచి స్థానిక అధికారుల వరకు సైలెంట్ అయిపోయారు. సామాన్యులకు వర్తించే రూల్సు ఏవీ అంగబలం, అర్ధబలం ఉన్న అక్రమాల అధికారికి వర్తించడం లేదు. చల్లారెడిపాలెం పంచాయతీ సచివాల యం-2 పరిధిలో సీలింగ్ భూముల్లో తరతరాల



పచ్చని పొలం పక్కన అక్రమ కట్టడం పనులు సాగుతున్న దృశ్యం

నుంచి పంటలు వేసుకొని రైతాంగం జీవిస్తుంటారు. యాభై ఏళ్ల క్రితం ఈ భూములు ఫారెస్ట్ కింద ఉండేవి నిరుపేదలకు ఈ భూముల పంపిణీలో భాగంగా అప్పటి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. విచిత్రం ఏమిటంటే ఈ అధికారి కడుతున్న గోడౌన్ పక్కనే పచ్చని పైరు కళకళలాడుతోంది. ఈ పైరు చూసి ఇక్కడ ఆకాశం కేసి చూసే అక్రమ కట్టడం వెనుక గల ఆంతర్యం అర్థం కావడం లేదు. పంట పొలాలను ల్యాండ్ కన్‌వర్షన్ లేకుండా ఎలా ఇంత నిర్మాణం చేపట్టారనేది ప్రశ్నగా మిగులుతోంది. ఇంతటి అక్రమ కట్టడం జరుగుతుంటే పర్యవేక్షించాల్సి గ్రామాధికారులు, ఇన్‌స్పెక్టర్లు, మండల అధికారులు ఏమి చేస్తున్నారో అర్థం కావడం లేదు. అక్రమ వ్యవహారం ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చాక ఆ అధికారి దిగివచ్చి ల్యాండ్ కన్వర్షన్‌కు కేవలం 35 సెంట్లకు మాత్రమే చలానా కట్టి మమ అనిపించడానికి పూనుకున్నట్లు సమాచారం. ఒకపక్క పచ్చని పైరు పంటలు ఆహ్లాదకరంగా ఉంటే స్థానిక రెవెన్యూ డివిజినల్ అధికారి మాత్రం ఏ సర్వే నెంబర్‌ను ల్యాండ్ కన్‌వర్షన్‌కు అనుమతిస్తే తనకు మట్టి అంటకుండా ఉంటుందా అనే వ్యవహారంలో తలమునకలై ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ల్యాండ్ కన్వర్షన్‌కు గుట్టుచప్పుడు కాకుండా అనుమతులు మంజూరు చేసేందుకు రంగం సిద్ధమయ్యింది. ల్యాండ్ కన్వర్షన్‌కు నిబంధనల ప్రకారం గ్రామంలో బహిరంగంగా ప్రజా అభిప్రాయాన్ని సేకరించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులే నిబంధనలను పెడచెవిన పెడుతుంటే మండల స్థాయి అధికారులకు ఊతం ఇచ్చినట్లు ఉంది. ఇప్పటికైనా ఈ వ్యవహారం గురించి జిల్లా జాయింట్ కలెక్టర్ ఇతర శాఖల ఉన్నతాధికారుల ద్వారా పూర్తి విచారణ చేపట్టినట్లయితే పూర్తి అధికారుల, అనధికారుల అవినీతి వెలుగు చూసే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

మెరిట్ టెస్ట్ విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని రామసుశీల నిలయంలో ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్-2023 విజేతలను పుట్టంరాజు బుల్లెయ్య, రామ లక్ష్మమ్మల ఛారిటబుల్ ట్రస్టు పక్షాన ప్రోత్సాహక బహుమతులతో ఆదివారం సత్కరించారు. బాపట్ల, ప్రకాశం, పలనాడు జిల్లాలకు చెందిన విజేతలు 15 మందికి 20 వేల రూపాయల విలువ చేసే ఎడ్యుకేషనల్ మెటీరియల్ అంద జేశారు. ఈ కార్యక్రమానికి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షత వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ టి వెంకట్రావు సంస్థ లక్ష్యాలను, ఆశయాలను సభకు వివరించారు. ఎలాంటి రుసుము లేకుండా ఆన్‌లైన్ విధానం లో 7వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి 9 లక్షలకు పైచిలు కు నగదు బహుమతులు అందించిన ఏకైక ఎన్‌జివో సంస్థ ఎపిఫని సంస్థ అని కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పేర్కొన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదనే లక్ష్యంగా పనిచేస్తున్న సంస్థ ఎపిఫని అని దిడ్లాస్వామి అన్నారు. ప్రభుత్వ పాఠశాల కోసం పనిచేస్తూ, విద్యార్థుల ప్రతిభకు పట్టం కడుతున్న సంస్థగా ఎపిఫనిని స్టేట్ కో ఆర్డినేటర్ దూదేకుల నబి అభివర్ణించారు. ఐఎఎస్ తరహాలో ఈ మెరిట్ టెస్ట్ నిర్వహించడం ద్వారా రాబోయే కాంపిటేటివ్ పరీక్షలను విద్యార్థులు ఆత్మస్థైర్యంతో రాస్తారని, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కూడా ఈ టెస్టులు ఉపయోగపడతాయని తిమ్మాయపాలెం ప్రధానోపాధ్యాయులు కెవి శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో నన్నెబోయిన రాఘవ, కె పోలిరెడ్డి, సిహెచ్ పద్మావతి, శ్యాంబాబు, శివప్రసాదు, శ్రీకృష్ణ, చుండూరి మురళీ సుధాకర్, లక్కరాజు విశ్వమోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాపట్ల, ప్రకాశం, పలనాడులకు చెందిన ఈఈ మెరిట్ టెస్ట్-2023 విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడదాం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కంపెనీలు, కార్ఖానాల్లో మహిళా కార్మికులపై జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా పురుషులతో సమానంగా వేతనం కోసం మహిళలందరూ ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ పిలుపునిచ్చారు. మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవానికి సంబంధించి గోడపత్రిక ఆవిష్కరణ స్థానిక పిఒడబ్ల్యు జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బి.పద్మ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళలు అసమాన త్యాగాలు చేసి, ఎనిమిది గంటల పనిదినాన్ని, వేతన పెంపును, మరికొన్ని హక్కులను సాధించుకున్నారన్నారు. ఈ హక్కుల సాధన కోసం ఎన్నో మహిళా ఉద్యమాలు నడిచి అవి విజయాలు సాధించాయన్నారు. కేంద్రంలోని బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం మతోన్మాదాన్ని రచ్చబడుతూ ప్రజల మధ్య వైష్యమాలు సష్టిస్తూ భౌతికంగా దాడులు చేసుకునే వాతావరణాన్ని కల్పిస్తుండటంతో స్త్రీల హక్కులు మరింతగా దిగజారే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న 498(ఏ),304(బి), ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం, డివియాక్టివ్ లైంగిక వేధింపుల అత్యాచార నిరోధక చట్టం, నిర్భయ వంటి మహిళా చట్టాలు సక్రమంగా అమలు కాకుండా నీరుగారిపోతున్నాయన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని ఊరువాడా ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భారతి, వి.మంజుల, జిల్లా నాయకులు సిహెచ్ పద్మ, వై.సుశీల, ఎన్.వేణి, వి.సుజాత, అమ్మాజీ, మహేశ్వరి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం



బాబూరావుకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

బహుముఖ ప్రజ్ఞాశాలి దర్భా బాబూరావు

ప్రజాశక్తి-బాపట్ల

అధ్యాపకుడిగా, కవి, చిత్రకారుడుగా బహుముఖ ప్రజ్ఞతో దివంగత విశ్రాంత అధ్యాపకుడు దర్భా బాబూరావు ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని సుప్రసిద్ధ రచయిత్రి చిల్లర భవానీదేవి అన్నారు. ఆదివారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో బాపట్ల శాఖ గ్రంథాలయంలో బాబూరావు సంస్మరణ సభ నిర్వహించారు. భవానీ దేవి మాట్లాడుతూ రచయితే గాక నటుడు, చిత్రకారుడిగా ఆర్ట్స్ కళాశాల విశ్రాంత కామర్స్ అధ్యాపకుడిగా విలక్షణ వ్యక్తిత్వంతో ఆయా రంగాల్లో ఔత్సాహికులను ఎందరినో వెన్ను తట్టి బాబూరావు ప్రోత్సహించారు. సభకు ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డబ్ల్యూఏజీకే మూర్తి అధ్యక్షత వహించారు. బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభలో ఫోరం కార్యదర్శి పిసి సాయిబాబు, లైబ్రేరియన్ ఏ శివాజీ గణేషన్, విశ్రాంత అధ్యాపకులు జి శాంతారామ్, పి ప్రసాద్, మోహన్‌రావు, చిత్రకారుడు జీవి, కవి మల్లికార్జున, న్యాయవాది జడ్ బాషా, రాంగోపాల్, కెవి అప్పారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

కౌన్సిలర్ బాలకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి-చీరాల

వైసిపి బాపట్ల జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షునిగా ఇటీవల కౌన్సిలర్ బాలకృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్ఆర్అండ్‌పిఎం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కౌన్సిలర్ బాలకృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి వాణిజ్య విభాగ అధ్యక్షులుగా బాలకృష్ణ నియామకం పట్ల అభినందనలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చైతన్య మనోవికాస కేంద్రం చైర్మన్ వెంకన్నకు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు చేయూతను అందించేందుకు బియ్యం బస్తా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ ఏసయ్య, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, దోగుపర్తి వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నక్కలపాలెంలో 150 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలంలోని నక్కలపాలెం గ్రామంలో గుంటూరు శ్రావణి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 150 మందికి షుగర్, బిపి, ఇసిజి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారు ఆరోగ్యశ్రీ సేవలు కూడా ఉచితంగా హాస్పిటల్‌లో లభిస్తాయని జనరల్ మేనేజర్ మగ్బుల్ వివరించారు. శిబిరంలో బాచిన సత్యనారాయణ, ఆర్ఎంపి వైద్యులు నాగండ్ల శ్రీనివాసర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఈఒ రామారావు

వికలాంగుల ప్రత్యేక అవసరాలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-బాపట్ల

వికలాంగులకు విద్యతోపాటు వారి ప్రత్యేక అవసరాల కోసం అవసరమైన ఉపకరణాలను అందజేసేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు అన్నారు. ఆదివారం బాపట్ల ఏబీఎం హైస్కూల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలు అందజేతకు నిర్వహించిన ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రామారావు మాట్లాడుతూ సమగ్ర శిక్షణ ద్వారా వికలాంగ పిల్లలకు అందుతున్న పరికరాలు, అలవెన్సుల వివరాలను వెల్లడించారు. బాపట్ల జిల్లా స్థాయిలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇక్కడ నిర్వహించిన వైద్య శిబిరంలో పరీక్షల అనంతరం 48 మందికి వినికిడి పరికరాలు, 16 వీల్ చైర్లు, 12 టీడబ్ల్యూఎం కిట్లు అవసరమైన వారిని నిర్ధారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త జి నాగేంద్రమ్మ, సైకాలజిస్ట్ కోటేశ్వరరావు, ఆడియాలజిస్ట్ లాస్య, గేశ్వరరావు, ఫిజియో థెరపిస్ట్ శ్రీధర్, స్కూల్ అసిస్టెంట్లు, ఈఆర్‌పి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తైక్వాండోలో పాల్గొన్న విద్యార్థులు

అట్టహాసంగా తైక్వాండో ఛాంపియప్ పోటీలు

ప్రజాశక్తి-రేపల్లె: రేపల్లె జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో సబ్ జూనియర్ విభాగంలో 12 సంవత్సరాలు 14సంవత్సరాల బాలబాలికలకు తైక్వాండో ఉమ్మడి గుంటూరు జిల్లాల చాంపియన్షిప్ పోటీలు స్టేట్ సెలక్షన్ ఫైట్ అట్టహాసంగా జరిగాయని డిస్టిక్ తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కె జగన్మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత గుంటూరు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు సబ్ జూనియర్ సీనియర్ కేటగిరీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ స్థానం పొందిన బాల బాలికలకు మార్చ్ 10,11,12 తేదీలలో విశాఖపట్నంలోని యలమంచిలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుందని అన్నారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి విజయ సారథి, పి శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబటివారిపాలెంలో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడు శివారు అంబటివారిపాలెంలో 490వ నేత్ర దానం జరిగింది. గ్రామానికి చెందిన అంబటి వీరనారాయణ(92) మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చారు. గుంటూరు శంకర నేత్రాలయం వైద్యులు రుతుజా అంబటివారిపాలెం వచ్చి కార్నియాలను సేకరింఎవరు. నేత్రదానం చేసినందుకు భార్య వీరమ్మ, కుమారులు ప్రతాప్ కుమార్, అంజమ్మ, నాగేశ్వరరావు, అంజన, కుమార్తె పద్మ, కుటుంబ సభ్యులను రోటరీక్లబ్ ఇంకొల్లు సెంట్రల్ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామమోహన్‌రావు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు కుటుంబ సభ్యులను, బంధుమిత్రులను అభినందించారు.



మందులు అందజేస్తున్న ప్రణీత్‌రెడ్డి, కార్పొరేటర్ ధనలక్ష్మి, మధు

మెడికల్ క్యాంప్ నిర్వహణ అభినందనీయం

వైసిపి యువ నాయకులు ప్రణీత్‌రెడ్డి

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహణ అభినందనీయమని వైసిపి యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి అన్నారు. నవయుగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాస్ హాస్పటల్ సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపును ఆదివారం స్థానిక మూడో డివిజన్ పరిధిలోని బలరాం కాలనీలో నిర్వహించారు. ఈ క్యాంప్‌ను ప్రణీత్‌రెడ్డి ప్రారంభించారు. ఉచిత వైద్యశిబిరం నిర్వహకులు, అందుకు సహకరించిన వైద్యులను ఆయన అభినందించారు. శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మూడో డివిజన్ కార్పొరేటర్ గుండు ధనలక్ష్మి, మధు, ఆరో డివిజన్ కార్పొరేటర్ చల్లా తిరుమలరావు, వైసిపి నాయకులు రావూరి బుజ్జి, ఎందేటి రంగారావు, బొమ్మినేని మురళి, జాఫర్, సిహెచ్ సత్యనారాయణరెడ్డి, డుంబూ, పిచ్చయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సిహెచ్ నాగరాజు పాల్గొన్నారు. ఉపాస్ వైద్యశాల డాక్టర్ ప్రకాష్ చావల, డాక్టర్ జోత్స్న కొప్పుల, డాక్టర్ శ్రీనివాస్ గోనుగుంట్ల పాల్గొని రోగులకు వైద్య సేవలందించారు.

వైసిపి నగర అధ్యక్షులు ఎవరు.?

- నిన్నటి దాకా రేసులో కటారి శంకర్ పేరు
- తాజాగా ప్రచారంలో శింగరాజు రాంబాబు..
- ఎవరి పేరు ప్రకటిస్తారోనని వైసిపి శ్రేణుల్లో జోరుగా చర్చ



శింగరాజు రాంబాబు (ఫైల్), కటారి శంకర్ (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

వైఎస్ఆర్ కాంగ్రెసు పార్టీలో ఒంగోలు నగర అధ్యక్షులు ఎవరు.? అనే చర్చ గత కొన్ని రోజులుగా జోరుగా జరుగుతోంది. ఆ పార్టీ నగర అధ్యక్షునిగా ఉన్న శింగరాజు వెంకట్రావు గత కొన్ని మాసాల కిందట అనారోగ్యంతో మరణించారు. దీంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. ఆ స్థానంలో ఎవరిని నియమిస్తారని క్యాడర్ ఎదురుచూసే తరుణంలో ఆ పార్టీ బిసి సెల్ జిల్లా అధ్యక్షునిగా ఉన్న కటారి శంకర్ పేరు తెరమీదకు వచ్చింది. మాజీ కౌన్సిలర్ అయిన శంకర్ మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ముఖ్య అనుచరుల్లో ఒకరు. దీంతో ఆయనే నగర అధ్యక్షుడని క్యాడర్‌లోకి బలమైన సంకేతాలు వెళ్లాయి. అయితే అధికారికంగా ప్రకటించలేదు. ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర కమిటీ జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. అందుకు అనుబంధంగా కొన్ని అనుబంధ సంఘాలకు జిల్లా అధ్యక్షులను కూడా ఇటీవలే ప్రకటించారు. తరువాత మరికొద్ది రోజుల్లోనే నగర అధ్యక్షులు, దాని అనుబంధ సంఘాల అధ్యక్షుల ప్రకటన ఉంటుందని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. అయితే ఈ తరుణంలోనే ఇప్పటివరకు నగర అధ్యక్షుని రేసులో ఉన్న కటారి శంకర్ స్థానంలో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శింగరాజు రాంబాబు పేరు ప్రచారంలోకి రావడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. శింగరాజు రాంబాబు కూడా సీనియర్ రాజకీయ నాయకుడు. బాలినేని శ్రీనివాసరెడ్డికి ముఖ్య అనుచరుడే. దీంతో నగర అధ్యక్షునిగా బాలినేని శ్రీనివాసరెడ్డి ఎవరి పేరును ప్రతిపాదించారు..? అధిష్టానం ఎవరి పేరును ప్రకటించనుంది.? అని నగర వైసిపి శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొని ఉంది. ప్రస్తుతం ఆ పార్టీకి నగర అధ్యక్షుడి లేని లోటు క్యాడర్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ కార్యక్రమం ఏదైనా నిర్వహించాలంటే నగరంలో స్పందన అంతంత మాత్రంగానే ఉంటుంది. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నగరంలో ఉంటేనే పార్టీ కార్యక్రమాల్లో ఊపు, ఉత్సాహంతో కార్యకర్తలు పాల్గొంటున్నారు. ఆయన అందుబాటులో లేకపోతే ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ మొక్కుబడిగా ఉంటుంది. అందుకు కారణం ఆ పార్టీకి నగర అధ్యక్షులు లేకపోవడమేనని పార్టీ శ్రేణులే చెబుతున్నాయి. దీంతో పార్టీ నగర అధ్యక్షుడి పదవి భర్తీ చేయాలనే ఆలోచనతో బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా గత కొంతకాలంగా కసరత్తు చేస్తున్నారని సమాచారం. అయితే నగర అధ్యక్షునిగా ఆయన ఎవరిని ప్రతిపాదిస్తారనే దాని మీద నగరంలో ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు కూడా ఎదురుచూస్తున్నారు. ఈ పరిణామాల్లో పార్టీ నగర అధ్యక్షుడు కావడానికి కటారి శంకర్‌కు, శింగరాజు రాంబాబుకు ఉన్న అర్హతలేంటి.? అనుకూల అంశాలు ఏంటి.? ప్రతికూల అంశాలు ఏంటి.? అనే చర్చ పెద్దఎత్తున జరుగుతోంది. వారిరువురి సామాజిక వర్గాలు వేరు కావడంతో ఏ సామాజిక వర్గానికి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రాధాన్యత ఇస్తారనే విశ్లేషణలు కూడా అధికార పార్టీలో జోరుగా సాగుతున్నాయి. రానున్నది ఎన్నికల కాలం కావడంతో వైసిపికి ఒంగోలు నగరంలో బలమైన అధ్యక్షుడు ఉండాలనేది ఆ పార్టీ శ్రేణుల ఆకాంక్షగా కనిపిస్తోంది.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య తెలిపారు. ఆదివారం యర్రగొండపాలెంలోని చైతన్యనగర్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా జాలా అంజయ్య మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పొక్కిరెడ్డి బాబురెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం లేదని విమర్శించారు. తద్వారా నిరుద్యోగం పెరిగి ప్రతి కుటుంబం ఆర్థిక సమస్యల్లో చిక్కుకుంటోందని తెలిపారు. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడానికి విద్యావంతులను శాసనమండలికి ఎన్నుకునే అవకాశం విద్యావంతులకు వచ్చిందని తెలిపారు. విద్యావంతుల పక్షాన పిడిఎఫ్ బలపర్చిన మీగడ వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రజాశక్తి ఒంగోలు ఎడిషన్ మేనేజర్ ఎంఎల్‌వి ప్రసాదరావు మాట్లాడుతూ చట్ట సభల్లో ప్రజా ప్రతినిధుల ధోరణి చూస్తుంటే వారి పదవులు డబ్బు సంపాదన కోసమే అన్నట్లుగా ఉందన్నారు. శాసన మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు అందరం కృషి చేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వీరారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు బలపర్చిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రఘురాం, యూటిఎఫ్ అధ్యక్షుడు ఏ నాగయ్య, యూటిఎఫ్ నాయకులు బి.బాబులు నాయక్, డి.బాలు నాయక్, ప్రజాసంఘాల నాయకులు షేక్ వలీసాహెబ్, గొట్టెముక్కల రాజారామయ్య పాల్గొన్నారు.

విగ్రహాల విషయంలో వివాదం

ప్రజాశక్తి-భట్టిప్రోలు



జేసీబీతో గుంట తీస్తున్న దృశ్యం

భట్టిప్రోలులో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చెయ్యాలని కొందరు, అబ్దుల్‌కలాం విగ్రహం నిర్మించాలని మరికొందరు వాగ్వివాదానికి దిగారు. ఆదివారం రాత్రి పిహెచ్‌సి ఎదురుగా ఆందోళన నెలకొంది. ఇప్పటికే నాలుగు విగ్రహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా ఎలాంటి అనుమతులూ లేవని అధికారులు పనులు నిలిపివేశారు. అదే ప్రాంతంలో ఉన్న ఖాళీలో దళిత నాయకులు అంబేద్కర్ విగ్రహం కోసం స్థలాన్ని చదును చేయగా ఈ స్థలం ఎప్పటినుండో తాము అబ్దుల్ కలాం విగ్రహాన్ని నిర్మించేందుకు ప్లెక్సీ కూడా ఏర్పాటు చేసి ఉంచామని, ఇక్కడ ఎవ్వరి విగ్రహాలు ఏర్పాటు చెయ్యటానికి ఒప్పుకునేది లేదంటూ పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు గుమిగూడి జేసీబీతో గుంట తీసి రాత్రికి రాత్రి పిల్లర్ నిర్మాణం చేపట్టారు. కాగా రెండు గ్రూపుల మధ్య తీవ్ర వాగ్వివాదం నెలకొంది. ఈ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా పోటీ పడి మరీ విగ్రహాలు ఏర్పాటుకు సిద్ధపడటం గ్రామంలో చర్చనీయాంశం అయ్యింది.

'విజయస్ఫూర్తి' పేరుతో

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పిజెవి.రామారావు



ముఖాముఖి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించటమే ధ్యేయంగా 'విజయ స్ఫూర్తి' అనే పేరుతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పిజెవి రామారావు చెప్పారు. ప్రతిరోజూ రెండు సబ్జెక్టుల్లో విద్యార్థులకు పరీక్షలు పెట్టి వారు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధమైన కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో విద్యాపరంగా ఉత్తమ ఫలితాల కోసం చేస్తున్న కృషి గురించి ఆయన 'ప్రజాశక్తి' వివరించారు.

ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 333 పాఠశాలలకు చెందిన 17,321 మంది విద్యార్థులు 103 పరీక్షా కేంద్రాలలో పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. విద్యార్థులను సదరు పరీక్షలకు సన్నద్ధం చేసే చర్యల్లో భాగంగా నిపుణులతో తయారుచేసిన ప్రశ్నాపత్రాలతో ప్రతి రోజూ రెండు పరీక్షలు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్నారు. పబ్లిక్ పరీక్షలకు ముందుగా 70 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ఒక్కొక్క విద్యార్థి ప్రతి సబ్జెక్టులో 15 నుంచి 20 సార్లు పరీక్ష రాస్తారు. వీటిని సబ్జెక్టు టీచర్లు పరీక్షించి వెనుకబడిన విద్యార్థులు మరింత మెరుగైన మార్కులు సాధించేలా సాధన చేయిస్తారు. గతేడాది జరిగిన 10వ తరగతి పరీక్షల్లో బాపట్ల జిల్లాలో 17,475 మంది హాజరుకాగా 13,212 మంది 75.6 శాతం ఉత్తీర్ణులు కావటం జరిగింది. ఈ ఏడాది మరింత ఉత్తమ ఫలితాల సాధన కోసం సమిష్టి కృషి జరుగుతుంది. 1 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇప్పటి వరకు మూడు పరీక్షలు జరిగాయి. ఎకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేశాం. ప్రతి విద్యార్థికీ సబ్జెక్టుల వారీగా వర్కుబుక్, నోట్‌బుక్ పెట్టి పరీక్షలు నిర్వహించి వారు మంచి మార్కులు సాధించేలా కృషి చేస్తున్నాం. జిల్లాలో ఒకటి నుండి పదో తరగతి వరకు 1,758 పాఠశాలల్లో 1,86,622 మంది విద్యార్థులుండగా 4,743 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

అమలవుతున్న పథకాలు

అమ్మఒడి పథకం ద్వారా జిల్లాలో 2021-22 విద్యాసంవత్సరానికి గానూ 1,19,953 మంది తల్లుల ఖాతాలలో రూ.179.93 కోట్లు జమ చేయబడ్డాయి. జగనన్న విద్యాకానుక ద్వారా 2022-23 విద్యాసంవత్సరానికి గాను 1,14,977 మంది విద్యార్థులకు ఒక్కొక్కటీ రూ.1,996 విలువ కలిగిన రూ 22.94 కోట్ల విద్యాకానుక-3 కిట్లు పంపిణీ చేశాం. జగనన్న గోరుముద్ద ద్వారా జిల్లాలోని 25 మండలాల్లో 1,428 పాఠశాలలో నెలకు రూ 2.70 కోట్లతో ప్రతిరోజు ఒక్కొక్క మెనూ అమలు చేస్తున్నాం.

96 విలీన పాఠశాలల ద్వారా మెరుగైన విద్య

బాపట్ల జిల్లాలో మొత్తం 64 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలోని 3, 4, 5 మరియు 6, 7, 8 తరగతులను 96 ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం ద్వారా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నాం. జిల్లాలో 19 జిల్లాపరిషత్ మరియు ప్రభుత్వ పాఠశాలలు బాలికల జూనియర్ కాలేజీలుగా ఉన్నతీకరణ చేయబడి 2022-23 విద్యాసంవత్సరములో తరగతులు ప్రారంభించాం. జిల్లాలోని 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి నుంచి ఈ విద్యా సంవత్సరం సి బి ఎస్ యి విధానంలో విద్యాబోధన ప్రారంభమైంది. 2022-23 విద్యాసంవత్సరానికి గానూ జిల్లాలో 13,040 మంది 8వ తరగతి చదువుచున్న విద్యార్థులకు మరియు 1,542 మంది 8వ తరగతికి బోధించే ఉపాధ్యాయులకు మొత్తం 14,582 మందికి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందించాం.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకం ద్వారా జిల్లాలో ఫేజ్-2 కింద జిల్లాలో 543 పాఠశాల భవనాల అభివృద్ధి కోసం రూ.187 కోట్లు మంజూరయ్యాయి. నాడు-నేడు ఫేజ్-1లో ఉమ్మడి బాపట్ల జిల్లాలో 481 పాఠశాల భవనాలను అభివృద్ధి చేశాం.

జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి జిల్లాలో పాఠశాల స్థాయి, మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పూర్తి చేసుకుని ఫిబ్రవరి 23న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించాం. జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులు తయారుచేసిన 135 ప్రాజెక్టులను ఈ ప్రదర్శనలో ఉంచారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులను మండల స్థాయికి, మండల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనలో అవకాశం కల్పించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ వైజ్ఞానిక ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి పంపుతున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థులలో నైపుణ్యాలను వెలికితీయడానికి నిష్ణాతులైన వారితో మూడంచెల ఎంపిక విధానాన్ని జిల్లాలో అమలు చేశారు. కౌశల్ క్విజ్‌లో జిల్లా వ్యాప్తంగా 200 టీములతో పోటీపడి ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాపట్ల ఉల్లిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో 36 టీంలను ఓడించి బాపట్ల జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.